ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక



సంపుటి: 6 సంచిక: 125, పేజీలు - 08

గురువారం, నవంబర్ 5, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

సదర్‌కు రాష్ట్ర ముద్ర

- యాదవుల ఆత్మగౌరవానికి మా భరోసా

- సదర్‌ను రాష్ట్ర పండుగగా అధికారిక గుర్తింపు - నిర్వహణకు రూ.5 కోట్లు మంజూరు

- యాదవులకు రాజకీయ, సామాజికంగా సముచిత స్థానం- జనాభా ప్రాతిపదికన భవిష్యత్తులోనూ వాటా కల్పిస్తాం

- శ్రీకృష్ణ సదర్ సమ్మేళనంలో సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) సదర్ అంటే కేవలం జల్సా కాదు, అది యాదవుల ఆత్మగౌరవానికి ప్రతీక తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే రాష్ట్ర పండుగ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. యాదవుల ఆత్మగౌరవాన్ని చాటిచెప్పే సదర్ సమ్మేళనాన్ని రాష్ట్ర పండుగగా అధికారికంగా ప్రకటించడంతో పాటు, దాని నిర్వహణ కోసం ప్రభుత్వం రూ.5 కోట్లు మంజూరు చేసిందని వెల్లడించారు. గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా సదర్‌ను రాష్ట్ర

2లో..



ఈసీలకు జీవితకాల రక్షణపై

సుప్రీం విచారణ

- సెక్షన్ 16 రాజ్యాంగబద్ధతపై పిటిషన్లు.. కేంద్రానికి నోటీసులు



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ), ఎన్నికల కమిషనర్లకు విధుల నిర్వహణ సమయంలో చేసిన పనులు, వ్యాఖ్యలకు సంబంధించి విస్తృత చట్టపరమైన రక్షణ కల్పించే నిబంధనపై సుప్రీంకోర్టు విచారణకు అంగీకరించింది. 2023లో తీసుకొచ్చిన ఎన్నికల కమిషనర్ల నియామకం, సేవా నిబంధనలు, పదవీకాలానికి సంబంధించిన చట్టంలోని సెక్షన్ 16 రాజ్యాంగబద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై కేంద్ర ప్రభుత్వానికి, భారత ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లోగా

2లో..

తెలంగాణ నీటి హక్కులపై

రాజీ పడుతున్నారా.?

- సీఎం రేవంత్ వైఖరిపై కవిత విమర్శలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) పోలవరం--బనకచర్ల లింక్ ప్రాజెక్టు విషయంలో తెలంగాణ ప్రభుత్వం భిన్నమైన వైఖరిని అనుసరిస్తోందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. నదీ జలాల వినియోగం, గోదావరి జలాల పంపిణీపై రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టమైన విధానం లేదని ఆరోపించారు. నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ సమావేశాల్లో రాష్ట్ర అధికారులు ఒక అభిప్రాయం వ్యక్తం చేస్తుండగా మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర హోంశాఖ మంత్రి ఆధ్వర్యంలో జరిగిన దక్షిణాది రాష్ట్రాల కౌన్సిల్ సమావేశంలో పోలవరం--బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు సమ్మతి తెలిపారని గుర్తు చేసారు. ఈ రెండు వైఖరులు పరస్పర విరుద్ధంగా ఉన్నాయని అన్నారు. ఎన్‌డబ్ల్యూడీఏ సమావేశాల్లో అధికారులు పాల్గొని గోదావరి-కావేరి నదుల అనుసంధానాన్ని సమ్మక్క సాగర్ తుపాకులగూడెం నుంచి చేపట్టాలని కోరుతున్నారని కవిత వివరించారు. అయితే అదే సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పోలవరం-బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు అంగీకారం తెలిపినట్లు ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన కీలకమైన అంశంపై ప్రభుత్వం ఒకే విధానంతో ముందుకు వెళ్లడం లేదని విమర్శించారు.

2లో..

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సర్వం సిద్ధం

- అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశం



అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్‌లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు పటిష్ఠమైన ప్రణాళికతో ముందుకు వెళుతున్నామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్ చంద్ర పునేఠా స్పష్టం చేశారు. రాష్ట్రంలో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో పోలింగ్‌కు పెద్దగా ఇబ్బందులు ఉండబోవని ఆయన తెలిపారు. బుధవారం విజయవాడలో జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా

2లో..

కరవు కష్టాల నుంచి రైతన్నను గట్టెక్కించండి

- కేంద్ర బృందానికి సీఎం చంద్రబాబు విజ్ఞప్తి

- కరవు పరిస్థితులపై కేంద్ర బృందంతో సీఎం చంద్రబాబు సమావేశం - రాష్ట్రానికి ప్రత్యేక సాయం అందించాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి

- వీబీ జీ రామ్ జీ పథకం పనిదినాలు 200కి పెంచాలని కోరిన సీఎం - కరవు బాధితులకు డ్రాట్ కార్డులు, జేజేఎం విస్తరణకు సహకరించాలని వినతి

- పంటల బీమా పరిహారం త్వరగా చెల్లించేలా చూడాలని సూచన



అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్‌లో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితులతో వ్యవసాయ రంగం కుదేలైన నేపథ్యంలో, రైతులను, ప్రజలను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహాయం అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. రాష్ట్రంలో కరవు తీవ్రతను అంచనా వేసేందుకు పర్యటించిన కేంద్ర అంతర మంత్రిత్వ శాఖల బృందం (ఐఎంసీటీ) బుధవారం అమరావతిలో ముఖ్యమంత్రిని కలిసింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వం చేపడుతున్న ఉపశమన చర్యలను సీఎం వారికి సమగ్రంగా వివరించారు. రాష్ట్రంలోని వాస్తవ పరిస్థితులను కేంద్ర బృందానికి వివరిస్తూ,

2లో..

మరో నాలుగు కార్పొరేషన్లలో ఇందిరమ్మ ఇండ్లు

- ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి సంబురాలు జరపాలన్న మంత్రి పొంగులేటి



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ నగరంలో నిర్మిస్తున్నట్టుగానే రాష్ట్రంలోని మరో నాలుగు నగరాల్లో ఇందిరమ్మ ఇళ్ల టవర్స్ నిర్మాణాలు చేపట్టనున్నట్టుగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా "మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి" కార్యక్రమంకు శ్రీకారం చూడుతున్నామని చెప్పారు. ఇందులో ప్రజాప్రతినిధులు, అధికారులు భాగస్వాములు కావాలని తెలిపారు. పేదల ఆత్మగౌరవానికి చిహ్నమైన ఇందిరమ్మ ఇళ్లను ఇవ్వాలన్న సంకల్పంతో ప్రజాప్రభుత్వం తొలివిడత మంజూరు చేసిన 4.50 లక్షల ఇళ్లలో ఇప్పటికి 2,21,500 గృహప్రవేశాలు పూర్తయ్యాయని చెప్పారు. ఈ దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని సీఎం రేవంత్ రెడ్డి సూచన మేరకు ప్రతి పేద కుటుంబంలో ఆనందాల వెలుగులు నిండి, ప్రతి ఇందిరమ్మ ఇంటి గడపలో దీపావళి కాంతులు విరజిమ్మాలని "మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి" అనే ఒక గొప్ప కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు గృహప్రవేశాలు జరుపుకున్న ఇందిరమ్మ ఇళ్లలో ఈ దీపావళి రోజున ఎమ్మెల్యేలతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, గృహ నిర్మాణ శాఖ అధికారులు, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు ప్రతి ఒక్కరూ

2లో..

ఢిల్లీ నేతల ముందు రాష్ట్ర నేతలు బానిసలా.?

- కాంగ్రెస్, బీజేపీలపై కేటీఆర్ నిప్పులు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కాంగ్రెస్, బీజేపీ రెండు పార్టీలూ తెలంగాణకు అన్యాయం చేస్తున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. ఢిల్లీ నాయకుల ముందు రాష్ట్ర నేతలు వణికిపోతున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నాయకులు ఢిల్లీ పెద్దల సంచులు మోస్తుంటే బీజేపీ నేతలు చెప్పులు మోస్తున్నారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ప్రయోజనాల కంటే ఢిల్లీ నాయకుల మెప్పు పొందడానికే రాష్ట్ర నేతలు ప్రాధాన్యత ఇస్తున్నారని విమర్శించారు. తెలంగాణ భవన్‌లో బుధవారం పలువురు నాయకులు బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. అమిత్ షా హైదరాబాద్‌కు వచ్చినప్పుడు కేంద్ర మంత్రి బండి సంజయ్ బాడీగార్డ్‌లా

2లో..

కేసీఆర్ మళ్లీ సీఎం కావాలి

సాగునీటి కోసం సైకిల్ యాత్ర!

- 8 రోజుల పాటు పది మంది యువకుల సైకిల్ యాత్ర

- రైతుల కష్టాలు, సాగునీటి సమస్యలను కేసీఆర్‌కు వివరించిన బృందం

- ఎండిన వరి కంకులను చూపిస్తూ రైతుల దీనస్థితి వివరణ



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ వ్యవసాయం మళ్లీ పూర్వ వైభవాన్ని సంతరించుకోవాలంటే కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి కావాలనే ఆకాంక్షతో గోదావరిఖనికి చెందిన పది మంది యువకులు సైకిల్ యాత్ర చేపట్టారు. సాగునీటి కోసం రైతులు పడుతున్న ఇబ్బందులను క్షేత్రస్థాయిలో తెలుసుకుంటూ, వారి ఆవేదనను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ నుంచి కొండపోచమ్మ సాగర్ వరకు ఎనిమిది రోజుల పాటు సుమారు 400 కిలోమీటర్లు సైకిల్‌పై ప్రయాణించి తమ యాత్రను పూర్తి చేశారు. గోదావరిఖనికి చెందిన మాజీ కార్పొరేటర్, పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు బొడ్డు రవీందర్ ఆధ్వర్యంలో పది మంది యువకులు ఈ యాత్ర నిర్వహించారు. అనంతరం ఎర్రవెల్లిలోని కేసీఆర్ నివాసానికి చేరుకుని ఆయనను కలిశారు. యాత్రలో ఎదురైన అనుభవాలు, రైతుల సమస్యలు, ప్రజల అభిప్రాయాలను వివరించారు.

సాగునీరు లేక రైతుల అవస్థలు

యాత్ర సందర్భంగా సాగునీరు అందక, విద్యుత్ సరఫరా సక్రమంగా లేక, బోర్లు ఎండిపోయి పంటలు దెబ్బతింటున్న రైతుల పరిస్థితులను కేసీఆర్‌కు వివరించారు. ఉమ్మడి పాలనలో తెలంగాణ వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోయిందని, కేసీఆర్ పదేళ్ల పాలనలో సాగునీటి ప్రాజెక్టులు, వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వడంతో పంట పొలాలు పచ్చగా మారి రైతుల్లో సంతోషం వెల్లివిరిసిందని గుర్తుచేశారు.

3లో..

అమెరికా పౌరులు లక్ష్యంగా ఫేక్ కాల్ సెంటర్ స్కామ్

- నలుగురు కీలక నిందితులను అరెస్ట్ చేసిన ఈడీ

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) అమెరికా పౌరులను లక్ష్యంగా చేసుకుని సాగుతున్న భారీ స్కామ్ కాల్ సెంటర్ మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దూకుడు పెంచింది. ఈ కుంభకోణంలో కీలకపాత్ర పోషించిన నలుగురు ప్రధాన నిందితులను అరెస్ట్ చేసింది. హర్షిల్ నయన్ భాయ్ రావల్,

2లో..

చిల్లర కోసం గొడవ..

మహిళా కండక్టర్ మృతి

- కండక్టర్ ప్రవీక కుటుంబానికి రేవంత్ సర్కార్ అండ

- ప్రవీక కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా

- ప్రభుత్వ ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు హామీ

2లో..



సదర్‌కు రాష్ట్ర ముద్ర

పండుగగా ప్రకటించాలనే ఆలోచన చేయలేదని, యాదవ సోదరుల విజ్ఞప్తి మేరకు తమ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించిన శ్రీకృష్ణ సదర్ సమ్మేళనంలో ముఖ్యమంత్రి పాల్గొని యాదవ సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సదర్ సమ్మేళనం కేవలం ఒక సామాజిక వర్గానికి మాత్రమే పరిమితమైన వేడుక కాదని, తెలంగాణ ప్రజలందరి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో శాస్త్రీయ పద్ధతిలో కులగణన చేపట్టి, దేశమంతా అనుసరించేలా తెలంగాణ మోడల్‌ను రూపొందించామని వివరించారు. యాదవ సామాజిక వర్గానికి తమ ప్రభుత్వం రాజకీయంగా, సామాజికంగా తగిన ప్రాధాన్యత కల్పిస్తోందని చెప్పారు.

యాదవులది ప్రత్యేక స్థానం

హైదరాబాద్ చరిత్రను ప్రస్తావిస్తూ నేడు ప్రపంచ ప్రసిద్ధి చెందిన గోల్కొండ కోట ఒకప్పుడు 'గొల్లకొండ'గా ఉండేదని సీఎం గుర్తుచేశారు. విశ్వనగరంగా ఎదుగుతున్న హైదరాబాద్ అభివృద్ధిలో యాదవ సోదరుల పాత్ర, సహకారం ఎంతో కీలకమని కొనియాడారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి బతుకుదెరువు కోసం నగరానికి వచ్చిన వారందరినీ యాదవులు ఆదరించి, అక్కున చేర్చుకున్నారని ప్రశంసించారు. తెలంగాణ సమాజంలో యాదవులకు ప్రత్యేకమైన స్థానం ఉందని, వారి సేవలను ప్రభుత్వం గుర్తిస్తోందని పేర్కొన్నారు.

రాజకీయంగా సముచిత ప్రాధాన్యత

యాదవ సామాజిక వర్గానికి తమ ప్రభుత్వం కల్పించిన అవకాశాలను సీఎం వివరించారు. అనిల్ కుమార్ యాదవ్‌కు రాజ్యసభ సభ్యుడిగా, నవీన్ యాదవ్‌కు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించామని తెలిపారు. ఈశ్వరమ్మ యాదవ్‌ను యాదగిరిగుట్ట దేవస్థానం బోర్డు సభ్యురాలిగా నియమించినట్లు గుర్తుచేశారు. ఆధ్యాత్మికంగా ఎంతో విశిష్టత కలిగిన యాదగిరిగుట్ట గోశాలలో గోసంరక్షణకు అవసరమైన అన్ని ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. రాబోయే రోజుల్లో జనాభా ప్రాతిపదికన యాదవులకు దక్కాల్సిన వాటాను కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వారి ఆత్మగౌరవానికి ఎక్కడా భంగం కలగకుండా చూసుకునే బాధ్యత తమ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు.

అభివృద్ధికి సహకరించాలి

తెలంగాణను దేశంలోనే అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రేవంత్ రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్ సమగ్ర అభివృద్ధికి కీలకమైన మూసీ నది పునరుజ్జీవం, మెట్రో రైలు విస్తరణ, భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధి ప్రాజెక్టులను వేగంగా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ప్రాజెక్టులు నగర భవిష్యత్తుకు మైలురాళ్లుగా నిలుస్తాయని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు యాదవ సోదరులు సంపూర్ణ సహకారం అందించాలని సీఎం కోరారు. తెలంగాణ ప్రగతి ప్రయాణంలో ప్రతి సామాజిక వర్గం భాగస్వామ్యం కావాలని, అందరి ఆత్మగౌరవాన్ని కాపాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని ఆయన స్పష్టం చేశారు

కరవు కష్టాల నుంచి రైతన్నను గట్టెక్కించండి

"ఒకవైపు తీరప్రాంతం తుఫాన్లతో నష్టపోతుంటే, మరోవైపు రాయలసీమ, ఇతర ప్రాంతాలు ఎల్ నినో ప్రభావంతో తీవ్ర కరవు కోరల్లో చిక్కుకున్నాయి" అని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది సాధారణం కంటే అత్యంత తక్కువ వర్షపాతం నమోదు కావడం వల్ల ఖరీఫ్ పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని తెలిపారు. ముఖ్యంగా రాయలసీమ జిల్లాల్లో పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా ఉందని, సాగునీటితో పాటు తాగునీరు, పశుగ్రాసానికి కూడా తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని వివరించారు. దేశంలోనే రెండో అత్యల్ప వర్షపాతం నమోదైన ప్రాంతంగా అనంతపురం జిల్లా నిలిచిన విషయాన్ని ఆయన బృందం దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే రాష్ట్రంలోని 21 జిల్లాల్లో 412 మండలాలను కరవు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించామని, పంట నష్టాలపై పూర్తిస్థాయి అంచనాలతో వారం రోజుల్లో కేంద్రానికి నివేదిక సమర్పిస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

వ్యవసాయానికి అండగా కీలక పథకాల విస్తరణ

కరవు పరిస్థితుల నేపథ్యంలో గ్రామీణ ఉపాధిని, వ్యవసాయాన్ని ఆదుకునేందుకు ముఖ్యమంత్రి కొన్ని కీలక ప్రతిపాదనలు చేశారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి క్షేత్రస్థాయిలో మానవ వనరుల అవసరం ఎక్కువగా ఉంటుందని, ఈ నేపథ్యంలో 'వీబీ జీ రామ్ జీ' పథకం కింద పనిదినాలను 200 రోజులకు పెంచాలని కోరారు.

ఈ పథకాన్ని వ్యవసాయ పనులకు అనుసంధానించడం ద్వారా రైతులకు కూలీల కొరత తీరడంతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని సూచించారు.కరవు కారణంగా రైతుల ఆదాయం పూర్తిగా పడిపోయిందని, గతంలో తీవ్ర కరవు వచ్చినప్పుడు రాయలసీమలో పది ఎకరాల రైతులకు కూడా రేషన్ కార్డులు ఇచ్చి ఆదుకున్నామని గుర్తుచేశారు. అదే తరహాలో ప్రస్తుతం అర్హులైన కరవు బాధిత కుటుంబాలకు 'డ్రాట్ కార్డులు' జారీ చేసే అంశాన్ని పరిశీలించి, కేంద్ర సహకారంతో నిత్యావసరాలను సబ్సిడీపై అందించాలని విజ్ఞప్తి చేశారు. దీంతో పాటు, రైతుల వ్యవసాయ రుణాలను రీషెడ్యూల్ చేసేందుకు కేంద్రం తోడ్పాటునందించాలని కోరారు.

జల్ జీవన్ మిషన్‌తో శాశ్వత పరిష్కారం

వర్షాభావంతో భూగర్భ జలమట్టాలు ప్రమాదకరంగా పడిపోయాయని, కొత్తగా ఎన్ని బోర్లు వేసినా నీళ్లు పడటం లేదని ముఖ్యమంత్రి తెలిపారు. కేవలం తాత్కాలిక నీటి సరఫరా చర్యలతో సరిపెట్టకుండా, శాశ్వత పరిష్కారాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. ఇందుకోసం 'జల్ జీవన్ మిషన్' (జేజేఎం) పథకాన్ని మరింత విస్తరించి, గ్రామీణ ప్రాంతాల్లో నీటి వనరుల అభివృద్ధి, అనుసంధానం వంటి పనులకు కేంద్రం మద్దతు ఇవ్వాలని కోరారు.పంటలు నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు పంటల బీమా పరిహారాన్ని త్వరగా అందించడం అత్యవసరమని అన్నారు. బీమా క్లెయిమ్‌ల పరిష్కారంలో జాప్యం లేకుండా, వీలైనంత త్వరగా పరిహారం రైతుల ఖాతాల్లో జమ అయ్యేలా కేంద్రం చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇది రైతులకు తదుపరి పంటకు పెట్టుబడిగా ఉపయోగపడుతుందని వివరించారు.ఈనెల 2, 3 తేదీల్లో కేంద్ర బృందం రెండు టీమ్‌లుగా విడిపోయి కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో పర్యటించింది. క్షేత్రస్థాయిలో పంట నష్టాలను పరిశీలించి, రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుంది. రాష్ట్ర ప్రభుత్వ నివేదిక, తమ క్షేత్రస్థాయి పరిశీలనల ఆధారంగా 15 రోజుల్లో కేంద్రానికి సమగ్ర నివేదిక సమర్పిస్తామని ఐఎంసీటీ సభ్యులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఈ నివేదిక ఆధారంగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అందించే సహాయంపై నిర్ణయం తీసుకోనుంది.

ఈసీలకు జీవితకాల రక్షణపై సుప్రీం విచారణ

తమ స్పందన తెలియజేయాలని ఆదేశించింది. ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝా, సామాజిక కార్యకర్త అరుణ్ అగ్రవాల్ ఈ పిటిషన్లు దాఖలు చేశారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనాలతో కూడిన ధర్మాసనం వీటిని విచారణకు స్వీకరించింది. ఇదే అంశంపై ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న మరో పిటిషన్‌తో కలిపి విచారిస్తామని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో కేంద్రం, ఎన్నికల సంఘం సమాధానాలు కీలకంగా మారాయి.

సెక్షన్ 16 ఏం చెబుతోంది.?

2023లో రూపొందించిన చీఫ్ ఎలక్షన్ కమిషనర్ అండ్ అదర్ ఎలక్షన్ కమిషనర్స్ (అపాయింట్‌మెంట్, కండిషన్స్ ఆఫ్ సర్వీస్ అండ్ టర్మ్ ఆఫ్ ఆఫీస్) చట్టంలోని సెక్షన్ 16పై ప్రధానంగా అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నిబంధన ప్రకారం విధుల నిర్వహణలో భాగంగా చేసిన చర్యలు, వ్యక్తం చేసిన వ్యాఖ్యలకు సంబంధించి ప్రస్తుత లేదా గత సీఈసీ, ఎన్నికల కమిషనర్లపై సివిల్, క్రిమినల్ కోర్టు కేసులను స్వీకరించకూడదు. ఇప్పటికే కొనసాగుతున్న కేసులను కూడా ముందుకు తీసుకెళ్లడానికి వీలుండదు. అంటే ఈ రక్షణ పదవిలో ఉన్నప్పుడే కాకుండా, పదవీ విరమణ తర్వాత కూడా వర్తించేలా నిబంధన రూపొందించారు. దీనివల్ల వారికి జీవితకాల చట్టపరమైన రక్షణ లభిస్తోందని పిటిషనర్లు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అవినీతి, ఉద్దేశపూర్వక చర్యలు, ఇతర తీవ్రమైన నేరాలకు సంబంధించిన ఆరోపణలు వచ్చినా ఈ నిబంధన అడ్డంకిగా మారుతుందని వాదిస్తున్నారు.

రాజ్యాంగం ఇవ్వని రక్షణ ఎలా కల్పిస్తారు?

ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝా తన పిటిషన్‌లో సెక్షన్ 16 రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. ఎన్నికల కమిషనర్లు ప్రజల చేత ప్రత్యక్షంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు కాకపోయినా, వారికి రాష్ట్రపతి, ఎంపీలు, న్యాయమూర్తులకు రాజ్యాంగం కల్పించిన రక్షణ కంటే విస్తృతమైన మినహాయింపును సాధారణ చట్టం ద్వారా కల్పించారని అభ్యంతరం తెలిపారు. రాష్ట్రపతి, గవర్నర్లకు ఆర్టికల్ 361, ఎంపీలు, ఎమ్మెల్యేలకు ఆర్టికల్స్ 105, 194 కింద నిర్దిష్ట రక్షణలు ఉన్నాయని గుర్తుచేశారు. అయితే రాజ్యాంగంలోని ఆర్టికల్ 324లో ఎన్నికల కమిషనర్లకు ఇలాంటి చట్టపరమైన మినహాయింపు లేదని వివరించారు.సుప్రీంకోర్టు న్యాయమూర్తిని తొలగించే విధానంలోనే ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను తొలగించాల్సి ఉంటుందని, ఈ నిబంధన పదవికి స్వతంత్రత, భద్రత కల్పించడానికే తప్ప, చట్టపరమైన చర్యల నుంచి సంపూర్ణ మినహాయింపు ఇవ్వడానికి కాదని మనోజ్ ఝా వాదించారు. ఎంపీలు అవినీతికి పాల్పడితే విచారణ ఎదుర్కోవాల్సి ఉంటుందని, న్యాయమూర్తులపైనా కేసులు నమోదు చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. విధుల నిర్వహణ పేరుతో నేరాలకు పాల్పడినా చర్యలు తీసుకోలేని పరిస్థితి ఏర్పడకూడదని అభిప్రాయపడ్డారు. రాజ్యాంగం ఏ వ్యక్తినీ చట్టానికి అతీతంగా ఉంచలేదని, అలాంటి రక్షణను సాధారణ చట్టం ద్వారా కల్పించడం సాధ్యం కాదని స్పష్టం చేశారు.

స్వాతంత్రం అంటే జవాబుదారీతనం లేకపోవడమా.?

సామాజిక కార్యకర్త అరుణ్ అగ్రవాల్ కూడా సెక్షన్ 16పై అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఈ సెక్షన్‌లోని 'ఇస్ ఆర్ వాస్' అనే పదాల వల్ల ప్రస్తుతం పదవిలో ఉన్నవారితో పాటు గతంలో ఆ బాధ్యతలు నిర్వహించిన వారికి కూడా జీవితకాల రక్షణ లభిస్తోందని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం స్వతంత్రంగా పనిచేయడం ఎంత ముఖ్యమో, అదే సమయంలో చట్టానికి జవాబుదారీగా ఉండటం కూడా అంతే ముఖ్యమని వాదించారు.

ఓటరు జాబితా నుంచి ఒకరి పేరు తప్పుగా తొలగించినా, దురుద్దేశంతో అభ్యర్థికి నష్టం కలిగించినా, ఎన్నికల సంఘంలో అవినీతి జరిగిందని ఆరోపణలు వచ్చినా చర్యలు తీసుకునే అవకాశం లేకుండా ఈ నిబంధన రక్షణ కల్పిస్తోందని పిటిషనర్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఎస్ఐఆర్ ప్రక్రియలోనూ పలు అవకతవకలు జరుగుతున్నాయన్న ఆరోపణలను పిటిషన్‌లో ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో సెక్షన్ 16ను రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించి రద్దు చేయాలని పిటిషనర్లు సుప్రీంకోర్టును కోరారు. ఇరుపక్షాల వాదనలు, కేంద్రం మరియు ఎన్నికల సంఘం సమాధానాల అనంతరం ఈ నిబంధన రాజ్యాంగబద్ధతపై అత్యున్నత న్యాయస్థానం నిర్ణయం తీసుకోనుంది. తదుపరి విచారణను డిసెంబర్ 18కి వాయిదా వేసింది.

తెలంగాణ నీటి హక్కులపై రాజీ పడుతున్నారా.?

ఈ ప్రాజెక్టు వల్ల తెలంగాణకు రావాల్సిన గోదావరి జలాల వినియోగంపై ప్రభావం పడే ప్రమాదం ఉందని కవిత ఆందోళన వ్యక్తం చేశారు. 2024లోనే తెలంగాణ జాగృతి తరఫున ఈ అంశంపై స్పందించి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టాలని భావిస్తున్న పోలవరం-బనకచర్ల లింక్ ప్రాజెక్టును అడ్డుకోవాలని డిమాండ్ చేసినట్లు గుర్తుచేశారు. తెలంగాణకు హక్కుగా దక్కాల్సిన 250 టీఎంసీల గోదావరి జలాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబుకు గురుదక్షిణగా సమర్పిస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు.కేంద్ర జలశక్తి శాఖ మంత్రి నిర్వహించిన ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలోనూ రేవంత్ రెడ్డి ఈ ప్రాజెక్టుకు అంగీకారం తెలిపారని కవిత ఆరోపించారు. సమావేశం అనంతరం మీడియా ముందు మాత్రం ఇందుకు భిన్నంగా మాట్లాడారని విమర్శించారు. ముఖ్యమంత్రి సమ్మతితోనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నదుల అనుసంధానంలో భాగంగా పోలవరం-బనకచర్ల ప్రాజెక్టును చేపట్టేందుకు కేంద్రంపై ఒత్తిడి తెస్తోందని ఆమె పేర్కొన్నారు. అయితే ఈ ఆరోపణలపై ప్రభుత్వం నుంచి వివరణ రావాల్సి ఉంది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశంపై స్పష్టమైన వైఖరి ప్రకటించాలని కవిత డిమాండ్ చేశారు. పోలవరం-బనకచర్ల లింక్ ప్రాజెక్టు వల్ల తెలంగాణ నీటి హక్కులకు కలిగే నష్టాన్ని గుర్తించి కేంద్రం నిర్వహించే ఈ ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని రకాల సంప్రదింపుల నుంచి రాష్ట్రం తక్షణమే వైదొలగాలని కోరారు. ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ ప్రధాని నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే లేఖ రాయాలని డిమాండ్ చేశారు.

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సర్వం సిద్ధం

ఎన్నికలు జరపాలని, ఇందుకోసం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. వర్ష ప్రభావిత ప్రాంతాల్లో ఓటర్లకు, సిబ్బందికి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎన్నికల కార్యదర్శి మల్లికార్జున మాట్లాడుతూ, పోలింగ్ విధుల్లో 2.52 లక్షల మంది, కౌంటింగ్‌లో 52 వేల మంది సిబ్బంది పాల్గొంటారని తెలిపారు. పశ్చిమ గోదావరి, గుంటూరు, బాపట్ల జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. పరిస్థితులను బట్టి పోలింగ్ కేంద్రాల్లో వీడియోగ్రఫీకి అనుమతిస్తామని, ప్రిసైడింగ్ అధికారులు తప్పనిసరిగా యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో మొత్తం ఓటర్ల సంఖ్య 2.61 కోట్లకు చేరిందని పేర్కొన్నారు.ఎన్నికల బందోబస్తుపై డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా మాట్లాడుతూ, ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహించేందుకు పటిష్ఠమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఒకే దశలో పోలింగ్ జరుగుతున్నందున రద్దీని నియంత్రించేందుకు తగినంత బలగాలను మోహరించామని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 582 జెడ్పీటీసీ స్థానాలు, 7,767 ఎంపీటీసీ స్థానాలకు గాను ఈ ఎన్నికలు జరుగుతున్నాయి. ఇప్పటికే 77 జెడ్పీటీసీ స్థానాలు, 2,051 ఎంపీటీసీ స్థానాలు ఏకగ్రీవం కావడంతో, మిగిలిన స్థానాలకు పోలింగ్ నిర్వహించనున్నారు. ఈ ఎన్నికల బరిలో 2,169 మంది జెడ్పీటీసీ అభ్యర్థులు, 18,843 మంది ఎంపీటీసీ అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.ఈ ఎన్నికల్లో మొత్తం 2.61 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో 1.28 కోట్ల మంది పురుషులు, 1.32 కోట్ల మంది మహిళలు, 1,282 మంది ఇతరులు ఉన్నారు. పురుషుల కంటే మహిళా ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉండటం గమనార్హం. ఓటర్ల సౌలభ్యం కోసం రాష్ట్రవ్యాప్తంగా 31,460 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎన్నికల సంఘం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. మొత్తం పోలింగ్ కేంద్రాల్లో 8,904 కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా, 7,160 కేంద్రాలను అత్యంత సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. ఈ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచారు. 16,064 కేంద్రాల్లో సీసీటీవీ కెమెరాలు, సుమారు 6,000 కేంద్రాల్లో ల్యాప్‌టాప్‌ల ద్వారా వెబ్‌కాస్టింగ్, 6,507 కేంద్రాల్లో వీడియోగ్రఫీ ద్వారా పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించనున్నారు.ఎన్నికల విధుల్లో భాగంగా 36,684 మంది ప్రిసైడింగ్ అధికారులను నియమించారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం సుమారు 40,679 మంది పోలీసు సిబ్బందిని మోహరించారు. సిబ్బందిని, ఎన్నికల సామగ్రిని తరలించేందుకు 4,442 భారీ వాహనాలు, 3,200 తేలికపాటి వాహనాలను వినియోగిస్తున్నారు. పోలింగ్ కోసం 1,01,618 బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేశారు. ఓట్ల లెక్కింపు కోసం 365 కేంద్రాలను ఏర్పాటు చేయగా, వాటిలో 9,062 కౌంటింగ్ టేబుళ్లను సిద్ధం చేశారు. గ్రామీణ ప్రాంతాలపై పట్టు నిరూపించుకునేందుకు ఈ ఎన్నికలు రాజకీయ పార్టీలకు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా మారాయి.

మరో నాలుగు కార్పొరేషన్లలో ఇందిరమ్మ టవర్లు

భాగస్వాములై మాఇందిరమ్మ ఇంట్లో దీపావళి అనే వేడుకను లబ్ధిదారులతో కలిసి కన్నుల పండుగగా ఘనంగా నిర్వహించాలని చెప్పారు. రాష్ట్రంలో అర్హులైన ఇల్లు లేని ప్రతి నిరుపేద కుటుంబానికి ఇల్లు ఇవ్వాలన్నదే ఇందిరమ్మ ప్రభుత్వ సంకల్పమని తెలిపారు.హైదరాబాద్ తరహాలోనే నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, నల్గొండ కార్పోరేషన్‌లలో త్వరలో మొదటి విడత ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ నిర్మాణాలు చేపట్టనున్నట్టుగా తెలిపారు. గ్రౌండ్ ప్లస్ 5 అంతస్తులతో వీటిని నిర్మించనున్నట్టుగా తెలిపారు.

దీపావళి పండుగలోపే ఇందుకు సంబంధించి నోటిఫికేషన్ ఇవ్వబోతున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. ఇక, మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టరేట్‌లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని భూ సర్వే, రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, హౌసింగ్ శాఖలకు సంబంధించిన అనేక అంశాలపై శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీధర్ బాబులు విస్తృత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మేడ్చల్ మల్కాజిగిరి, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలకు సంబంధించి పలు సమస్యలను ప్రజా ప్రతినిధులు ప్రస్తావించారు. ఈ క్రమంలోనే ప్రధానంగా రైతుల ప్రయోజనాల కోసమే చేపట్టిన భూముల రీసర్వే వారి సమక్షంలోనే చేసి భూ సమస్యల పరిష్కరించాలని అధికారులను మంత్రి పొంగులేటి ఆదేశించారు. అదే విధంగా రీసర్వే జరిగే గ్రామాల్లో ప్రతిరోజు తహశీల్దార్లు పర్యటించాలని ఆర్డీవో, అదనపు కలెక్టర్లు, కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించడమేగాక కనీసం వారానికోరోజు రీసర్వే జరిగే గ్రామాలకు వెళ్లాలని సూచించారు. రెవెన్యూ, అటవీ శాఖల మధ్య సరిహద్దు వివాదాలు, పట్టా భూములకు సంబంధించిన సమస్యలు, భూముల హద్దులపై నెలకొన్న వివాదాలు వంటి అంశాలను కూడా సమగ్ర సర్వే ద్వారా గుర్తించి పరిష్కరిష్కరించాలని మంత్రి పొంగులేటి చెప్పారు. 22ఏ కు సంబంధించి ఇప్పటివరకు ఇచ్చిన జీవోలు, మెమోలతో పరిష్కారం కానీ అంశాలు ఏమైనా ఉంటే పరిశీలించి వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి పొంగులేటి ఆదేశించారు.

ఢిల్లీ నేతల ముందు రాష్ట్ర నేతలు బానిసలా.?

వ్యవహరించారని విమర్శించారు. మరోవైపు ప్రియాంక గాంధీ భద్రతా సిబ్బంది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని పక్కకు నెట్టేశారని ఆరోపించారు. కేంద్ర మంత్రి హోదాలో ఉన్న బండి సంజయ్ కరీంనగర్ ప్రజల గౌరవాన్ని దిగజార్చవద్దని హితవు పలికారు. తనకంటే వయసులో చిన్నవాడైన అమిత్ షాకు రాంచందర్‌రావు కాళ్లకు నమస్కరించడమేంటని ప్రశ్నించారు.

తెలంగాణకు ఏం తెచ్చారు?

అమిత్ షా తెలంగాణకు వచ్చి చేతులు ఊపుకుంటూ వెళ్లిపోయారని, రాష్ట్రానికి ఏం ఇచ్చారని కేటీఆర్ నిలదీశారు. ఒక్క మెట్రో ప్రాజెక్టునైనా, జాతీయ ప్రాజెక్టునైనా, కనీసం ఒక విద్యాసంస్థనైనా మంజూరు చేశారా అని ప్రశ్నించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తెలంగాణ అభివృద్ధికి అవసరమైన ప్రాజెక్టులు తీసుకురావడంలో విఫలమైందని విమర్శించారు. రాష్ట్రానికి రావాల్సిన ప్రయోజనాలపై కేంద్రాన్ని నిలదీయాల్సిన బీజేపీ నేతలు, ఢిల్లీ పెద్దల సేవలో మునిగిపోయారని ఆరోపించారు.

రేవంత్‌ది ఈఎంఐ పాలన!

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తరచూ ఢిల్లీ పర్యటనలు చేస్తూ రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. వారానికి రెండుసార్లు ఢిల్లీకి వెళ్తూ ఆయన 'ఈఎంఐ ముఖ్యమంత్రి'గా మారిపోయారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధిపై దృష్టి పెట్టాల్సిన సీఎం రాజకీయ అవసరాల కోసం ఢిల్లీ చుట్టూ తిరుగుతున్నారని ఆరోపించారు.

అటవీ ప్రాంతాలను నరికే వీరప్పన్‌ను అటవీశాఖ మంత్రిగా నియమించినట్లుగా, భూములు అమ్మే బ్రోకర్‌ను ముఖ్యమంత్రిని చేస్తే ఎలా ఉంటుందో రేవంత్‌రెడ్డి పాలన అలా ఉందంటూ కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్, బీజేపీ నేతలు ఢిల్లీ నాయకుల ఆదేశాలకు తలొగ్గకుండా తెలంగాణ ఆత్మగౌరవం, రాష్ట్ర ప్రయోజనాల కోసం పనిచేయాలని ఆయన వ్యాఖ్యానించారు.

అమెరికా పౌరులు లక్ష్యంగా ఫేక్ కాల్ సెంటర్ స్కామ్

జస్వంత్ సింగ్, చేతన్ ముంజల్, ప్రణవ్ పిఠాడియాలను మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద అదుపులోకి తీసుకున్నట్టు హైదరాబాద్ లోని ఈడీ ప్రాంతీయ కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. నిందితులను నాంపల్లిలోని ప్రత్యేక కోర్టులో హాజరుపరచగా, కోర్టు వారికి జ్యుడీషియల్ కస్టడీ విధించింది.

ఈ కేసులో ఇప్పటికే జూలై-ఆగస్టు నెలల్లో వికాస్ నిమార్, తారాచంద్ నిమార్, మహ్మద్ ఇర్ఫాన్ అన్సారీలను అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. తాజా అరెస్టులతో ఈ కేసులో ఈడీ అదుపులోకి తీసుకున్న వారి సంఖ్య ఏడుకు చేరింది. ఈ స్కామ్‌పై దర్యాప్తులో భాగంగా సెప్టెంబర్ 15న పాటియాలా, పుణే, చండీగఢ్‌లలో ఈడీ సోదాలు నిర్వహించింది. ఆ సమయంలో సుమారు 220 మంది సిబ్బందితో నడుస్తున్న మూడు లైవ్ కాల్ సెంటర్లను గుర్తించి, పలు డిజిటల్ పరికరాలు, నగదు, రికార్డులను స్వాధీనం చేసుకుంది.

మోసం చేసే విధానం ఇది..

ఈ ముఠా పనితీరు అత్యంత వ్యవస్థీకృతంగా సాగినట్టు ఈడీ దర్యాప్తులో తేలింది. జర్మనీ, ఫిన్లాండ్‌లలోని సర్వర్ల ద్వారా సుమారు 20 లక్షల మంది అమెరికన్ల ఫోన్ నంబర్ల జాబితాను ఉపయోగించి ఆటో-డయలర్లతో కాల్స్ చేసేవారు. బాధితులకు వారి ఖాతాల్లో అనుమానాస్పద లావాదేవీలు జరిగాయని లేదా వారి కంప్యూటర్‌లో వైరస్ ఉందని నమ్మించేవారు. అనంతరం, భారత్‌లోని కాల్ సెంటర్లకు కనెక్ట్ అయ్యే టోల్-ఫ్రీ నంబర్లకు కాల్ చేయమని సూచించేవారు. కాల్ మాట్లాడే సిబ్బంది తమను డ్రగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడ్మినిస్ట్రేషన్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్, ట్రెజరీ వంటి అమెరికా ప్రభుత్వ సంస్థల అధికారులమని పరిచయం చేసుకునేవారు. నకిలీ ఐడీ కార్డులు, అధికారిక లేఖలు చూపించి బాధితులను భయపెట్టేవారు. డ్రగ్స్ లేదా మనీలాండరింగ్ కేసులతో సంబంధం ఉందని, అరెస్ట్ చేస్తామని, బ్యాంకు ఖాతాలు స్తంభింపజేస్తామని బెదిరించేవారు. ఈ వ్యవహారాన్ని రహస్యంగా ఉంచాలని చెప్పి, వారి డబ్బును 'ప్రభుత్వం వద్ద భద్రపరచాలి' అని నమ్మించి కొల్లగొట్టేవారు.

హవాలా, క్రిప్టో మార్గాల్లో నగదు బదిలీ

బాధితుల నుంచి బంగారం కడ్డీలు, కొరియర్లలో పంపిన నగదు, మనీ మ్యూల్ ఖాతాలకు బదిలీలు, బిట్‌కాయిన్ ఏటీఎంలలో డిపాజిట్లు, గిఫ్ట్ కార్డుల రూపంలో డబ్బును వసూలు చేశారు. అమెరికాలో సేకరించిన ఈ డబ్బును దుబాయ్, హాంకాంగ్‌లలోని కంపెనీల ఖాతాల ద్వారా, క్రిప్టో ఆస్తుల రూపంలోకి మార్చి, చివరకు హవాలా, అంగడియా మార్గాల ద్వారా భారత్‌కు తరలించినట్టు ఈడీ గుర్తించింది.

ఈ ముఠా జూలై 2025 నుంచి సెప్టెంబర్ 2026 మధ్య కాలంలో 927 లావాదేవీల ద్వారా సుమారు 27.39 మిలియన్ డాలర్లు (దాదాపు రూ. 261 కోట్లు) కొల్లగొట్టినట్లు తేలింది. ఇప్పటివరకు 549 మంది బాధితులను గుర్తించగా, వారిలో చాలామంది 1940లలో జన్మించిన వృద్ధులే కావడం గమనార్హం. అరెస్ట్ అయిన ప్రణవ్ పిఠాడియా పాటియాలాలోని కాల్ సెంటర్లకు యజమానిగా, మేనేజర్‌గా వ్యవహరించినట్టు దర్యాప్తులో తేలింది. ఈ నేరంలో ప్రమేయమున్న మరికొందరిని గుర్తించేందుకు, అక్రమంగా సంపాదించిన ఆస్తుల జాడను కనుగొనేందుకు దర్యాప్తు కొనసాగిస్తున్నట్టు ఈడీ అధికారులు తెలిపారు.

చిల్లర కోసం గొడవ.. మహిళా కండక్టర్ మృతి

- కండక్టర్ ప్రవళిక కుటుంబానికి రేవంత్ సర్కార్ అండ

- ప్రవళిక కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా

- ప్రభుత్వ ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు హామీ

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ఆర్టీసీ మహిళా కండక్టర్ గుండ్ల ప్రవళిక మృతిచెందారు. బస్సులో జరిగిన గొడవ తర్వాత ప్రయాణికురాలు కిందకు నెట్టేయడంతో తీవ్రంగా గాయపడిన కండక్టర్ ప్రవళిక ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. ఇందుకు సంబంధించిన వవరాలు ఇలా ఉన్నాయి, మణగూరు ఆర్టీసీ డిపోలో గుండ్ల ప్రవళిక కండక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. అక్టోబర్ 25న మణూగూరు-భద్రాచలం పల్లె వెలుగు బస్సులో ప్రవళిక విధుల్లో ఉన్నారు. అయితే ఆ సమయంలో కండక్టర్ ప్రవళికకు, బస్సులోని ప్రయాణికురాలు బానోత్ మౌనికతో వాగ్వాదం జరిగింది. చిల్లర విషయంలో ఈ గొడవ జరిగినట్టుగా తెలుస్తోంది. ఈ క్రమంలోనే మౌనిక నెట్టివేయగా ప్రవళికల కిందపడిపోయారు.ప్రవళిక రోడ్డుపై పడిపోగా, బస్సు వెనుక చక్రాలు ఆమెపై నుంచి వెళ్ళాయి. దీంతో ప్రవళిక కాళ్లు దెబ్బతినడంతో పాటు తీవ్ర గాయాలయ్యాయి. ప్రవళికను మొదట భద్రాచలంలోని ఆసుపత్రికి, ఆ తర్వాత మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఉన్నతాధికారులు ప్రవళికను పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని ఆస్పత్రి వైద్యులకు సూచించారు.అయితే వైద్యులు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలించలేదు. ఈ క్రమంలోనే ప్రవళిక మంగళవారం తుదిశ్వాస విడిచారు. ఈ కక్రమంలోనే ప్రవళిక కుటుంబానికి న్యాయం చేయాలని, ఆమె మృతికి కారణమైనవారిపై చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం మణుగూరు డిపో బంద్‌కు పిలుపునిచ్చాయి. ప్రవళిక మరణం సంస్థకు పూడ్చలేని నష్టమని టీజీఎస్‌ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వై నాగిరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీతో మాట్లాడిన నాగిరెడ్డి అనుమానితురాలైన మహిళపై హత్య కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. తెలంగాణ ఆర్టీసీ ప్రవళిక కుటుంబానికి అన్ని విధాలా అండగా నిలుస్తుందని, విధుల్లో ఉన్న ఉద్యోగులపై దాడులు జరగకుండా నివారణ చర్యలు తీసుకుంటుందని ఆయన హామీ ఇచ్చారు.

మణుగూరు డిపో మహిళా కండక్టర్ గుండ్ల ప్రవళిక మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ప్రవళిక కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేశారు. ప్రవళిక కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని, అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తుందని హామీ ఇచ్చారు. కండక్టర్ గుండ్ల ప్రవళిక మృతి పట్ల మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేశారు. ఇటీవల ప్రయాణికులతో జరిగిన వివాదంలో బస్సు టైర్ల కింద పడి తీవ్రంగా గాయపడిన ప్రవళికకు హైదరాబాద్‌లోని సాయి సంజీవని ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందించామని తెలిపారు. ప్రవళిక ఆరోగ్యం మెరుగుపడి త్వరగా కోలుకొని తిరిగి విధుల్లో చేరుతారని ఆశించానని వారు మృతి చెందడం అత్యంత బాధాకరమని చెప్పారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ఇక, ఉస్మానియా ఆసుపత్రి మార్చురీ వద్ద కండక్టర్ ప్రవళిక పార్థివదేహానికి మంత్రి పొన్నం ప్రభాకర్ నివాళులు అర్పించారు. ప్రవళిక తల్లిని పరామర్శించి వారికి ఆర్టీసీ కుటుంబం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో ప్రవళిక తల్లికి ఉద్యోగం, ఇందిరమ్మ ఇళ్లు ,ప్రభుత్వం, ఆర్టీసీ నుండి 10 లక్షల రూపాయల ఎక్స్ గ్రేషియా ఆర్టీసీ తీసుకున్న నిర్ణయంలో భాగంగా బ్యాంకు నుంచి కోటి రూపాయలు ప్రమాదా భీమా అందనుందని తెలిపారు.

షాద్ నగర్ నియోజకవర్గానికి
డీకే అరుణ చేసింది ఏమిటి..?

- షాద్ నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్ నిలదీత - ఎంపీ లేఖలు ఎక్కడ?.. ప్రొసీడింగ్స్ చూపగలరా?

- ఫొటోల రాజకీయం తప్ప షాద్‌నగర్‌కు ఎంపీ అరుణ సాధించింది శూన్యం - షాద్‌నగర్ మీడియా సమావేశంలో కాంగ్రెస్ నేతలు

షాద్‌నగర్ పట్టణంలో ప్రతిపాదిత రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ ఘనత తమదేనంటూ బీజేపీ నాయకులు ఎంపీ డీకే అరుణకు కృతజ్ఞతలు చెప్పడం కేవలం ప్రచారార్భాటమేనని షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. అసలు ఈ ప్రాజెక్టు కోసం ఎంపీగా డీకే అరుణ అధికారికంగా చేసిన కృషి ఏంటో, ఎవరికి ప్రతిపాదనలు పంపారో, ఏ తేదీల్లో లేఖలు రాశారో ప్రజల ముందు ఆధారాలతో నిరూపించాలని ఆయన సవాల్ విసిరారు. స్థానిక సీనియర్ కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా బాబర్ మాట్లాడుతూ.. షాద్‌నగర్ రైల్వే బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియ పూర్తిగా అధికారిక యంత్రాంగం ద్వారా చట్టబద్ధంగా జరుగుతోందని స్పష్టం చేశారు. భూసేకరణ కోసం ఆర్డీవో కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్‌కు అధికారిక లేఖలు వెళ్లాయని, ఆపై కలెక్టర్ ద్వారా ఐడీఓఆర్ (ఎడఖీ) కమిషనర్‌కు సమాచారం అందిందని తేదీలతో సహా సంబంధిత ప్రొసీడింగ్స్ పత్రాలను ఆయన మీడియాకు చూపించారు. ఈ క్రమంలో ఇళ్లు, స్థలాలు కోల్పోతున్న నిర్వాసితులకు న్యాయం జరిగేలా, వారికి ఎంత పరిహారం (కాంపెన్సేషన్) అందించాలన్న విషయమై ఆర్డీవో కార్యాలయం ఆధ్వర్యంలో బాధితులతో ప్రత్యేక సమావేశాలు కూడా నిర్వహించారని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పనుల్లో జాప్యం జరిగే అవకాశం ఉండటంతో, ప్రాజెక్టు ప్రాముఖ్యత దృష్ట్యా రైల్వే విభాగమే స్వయంగా 100 శాతం నిధులతో ఈ నిర్మాణాన్ని పూర్తిచేయాలని నిర్ణయించిందని బాబర్ వెల్లడించారు. గతంలో పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, ఎమ్మెల్యే శంకరయ్య వంటి నాయకులు సమస్య తీవ్రతను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారని గుర్తుచేశారు. అయితే, స్థానిక ఎంపీగా ఉన్న డీకే అరుణ మాత్రం షాద్‌నగర్ నియోజకవర్గానికి ప్రత్యక్షంగా తెచ్చిన నిధులు ఏమున్నాయో చెప్పాలని నిలదీశారు.

ఢిల్లీకి వెళ్లి పార్టీ పెద్దలను, కేంద్ర మంత్రులను కలిసి మర్యాదపూర్వకంగా శాలువాలు కప్పడం, ఫొటోలు దిగడం తప్ప నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి ఆమె చేసిందేమీ లేదని మండిపడ్డారు. ప్రచార పిచ్చితో సంబంధం లేని పనులకు క్రెడిట్ కొట్టేయాలని చూడటం బీజేపీ నాయకులకే చెల్లిందని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు చంది తిరుపతి రెడ్డి, మహబూబ్, రమేష్, చంద్రశేఖర్ గౌడ్, చందం నరసింహులు, జంగయ్యలతో పాటు డిప్యూటీ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ముక్కుపోగుల ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు



నీలా మోసాలు చేయడం మా ఎమ్మెల్యేకు చేతకాదు

- ఎమ్మెల్యేపై నిరాధార ఆరోపణలు చేస్తే ఊరుకోం
- షాద్ నగర్ కాంగ్రెస్ నేత రఘు నాయక్ హెచ్చరిక
- షాద్‌నగర్ అభివృద్ధిని చూసి ఓర్వలేకే విష్ణువర్ధన్ రెడ్డి అసత్య ప్రచారాలు
- ప్రజా సంక్షేమం కోసం పని చేసే ఎమ్మెల్యేపై చవకబారు విమర్శలా?
- విష్ణువర్ధన్ రెడ్డి వ్యాఖ్యలకు గిరిజన ఆదివాసీ రాష్ట్ర కోఆర్డినేటర్ రఘు నాయక్ ఆగ్రహం
- పాలమూరు సొంత రాజకీయ కుంపటి తప్ప మరొకటి కాదు
- జూనియర్ కేఏ పాల్ చేతలు మానుకో..!



షాద్ నగర్ నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధే ధ్యేయంగా నిరంతరం ప్రజల్లో ఉంటూ సేవలందిస్తున్న స్థానిక శాసనసభ్యుడిపై షాద్ నగర్ జూనియర్ కేఏ పాల్ గా పేరు గాంచిన పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి నిరాధారమైన, చవకబారు ఆరోపణలు చేస్తే సహించేది లేదని గిరిజన ఆదివాసీ రాష్ట్ర కోఆర్డినేటర్ రఘు నాయక్ తీవ్రస్థాయిలో హెచ్చరించారు. షాద్‌నగర్ పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల స్థానిక నాయకుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి ఎమ్మెల్యేను ఉద్దేశించి చేసిన విమర్శలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఎమ్మెల్యేకు పనులు చేయడం చేతకాదని, పరిపాలనపై అవగాహన లేదంటూ మాట్లాడటం విష్ణువర్ధన్ రెడ్డి అజ్ఞానానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధిని ప్రశ్నించే హక్కు ఎవరికైనా ఉంటుందని, అయితే అభివృద్ధిని విస్మరించి వ్యక్తిగత విమర్శలు, బెదిరింపు ధోరణికి దిగితే ఇక్కడ భయపడేవారు ఎవరూ లేరని స్పష్టం చేశారు.అభివృద్ధి పనుల ప్రగతిని చూడండిఎమ్మెల్యే ఆధ్వర్యంలో నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో నిధులు మంజూరై అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయని రఘు నాయక్ పేర్కొన్నారు. ప్రజల రాకపోకలు, దర్గా మార్గ ప్రయాణికుల సౌకర్యార్థం వై-జంక్షన్ విస్తరణ, ఆర్ అండ్ బి రహదారి పనుల కోసం పార్టీలకు అతీతంగా కేంద్ర, రాష్ట్ర అధికారులతో ఎమ్మెల్యే స్వయంగా మాట్లాడి మంజూరు చేయించారని వెల్లడించారు.విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ జూనియర్ కళాశాల ఆధునికీకరణ కోసం దాదాపు రూ.15 కోట్లు సమీకరించడం జరిగిందన్నారు. కొందుర్గు ప్రాంతంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ప్రాజెక్టు కింద సుమారు రూ.250 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారని తెలిపారు. హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు స్వగ్రామంలో అత్యాధునిక 'తెలంగాణ పబ్లిక్ స్కూల్' ఏర్పాటుకు నిధులు సాధించిన ఘనత ఎమ్మెల్యేకే దక్కుతుందని స్పష్టం చేశారు. 'కామ్రేడ్' పదం వాడే అర్హత నీకు ఉందా?'ఖబర్దార్ కామ్రేడ్' అంటూ పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి హెచ్చరికలు జారీ చేయడాన్ని రఘు నాయక్ ఎద్దేవా చేశారు. "కామ్రేడ్ అంటే సహచరుడు, ప్రజా ఉద్యమాల్లో కలిసి నడిచే తోటి సోదరుడు అని అర్థం. జాతి నిర్మాత జవహర్‌లాల్ నెహ్రూ సైతం ఆ పదాన్ని గౌరవప్రదంగా ఉపయోగించారు. మతం, కులం పేరిట ప్రజల మధ్య చిచ్చుపెట్టే సిద్ధాంతాలు కలిగిన బిజెపి పార్టీలో ఉండే నాయకులకు 'కామ్రేడ్' పదాన్ని పలికే నైతిక హక్కు లేదు" అని ఘాటుగా బదులిచ్చారు. నిజంగా నియోజకవర్గ ప్రజల క్షేమం కోరే వారైతే ప్రజాసమస్యలపై నిర్మాణాత్మకమైన సలహాలు, సూచనలు ఇవ్వాలని, వాటిని ప్రభుత్వం చిత్తశుద్ధితో స్వీకరిస్తుందని తెలిపారు. అలా కాకుండా మీడియా ముందు మైలేజ్ కోసం అవాకులు చవాకులు పేలితే రాజకీయంగా గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఏ కాంగ్రెస్ పార్టీని అయితే పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి తిడుతున్నాడో అదే పార్టీ నుండి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గా ఎంపికైన విషయాన్ని మరువద్దని సూచించారు. నువ్వు చేసే పిచ్చి పనులకు ఇక్కడ ప్రజలు జూనియర్ కేఏ పాల్ అని మీపై ప్రచారం చేస్తున్నారని ఇది గమనించుకొని మసలుకోవాలని పేర్కొన్నారు. గతంలో మాజీ మున్సిపల్ చైర్మన్ నరేందర్ అనుచరుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డిని చెంపదెబ్బ కొట్టిన అంశాన్ని సైతం ఆయన ప్రస్తావించారు. ఈ పాత్రికేయుల సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు చంది తిరుపతి రెడ్డి, మహబూబ్, రమేష్, చంద్రశేఖర్ గౌడ్, చందం నరసింహులు, జంగయ్య, డిప్యూటీ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ముక్కు పోగులు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు

- విజయ రమణారావు



సుల్తానాబాద్ రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని దళారులను నమ్మి మోసపోవద్ద ని ప్రభుత్వ విప్పు, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. పెద్దపెల్లి జిల్లా సుల్తానాబాద్ మండలంలోని సుద్దాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో బుధవారం సుద్దాల, అల్లిపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వారి ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో భూగర్భ జలాలు అడుగంటి పోయి సాగునీటికి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు. రైతులు ఆరుతడి పంటలపై దృష్టి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు సింగిల్ విండో చైర్మన్లు. అనేడి భాస్కర్ రెడ్డి, చిలుక సతీష్, సర్పంచులు ఓజా సంపత్ యాదవ్, కోదాటి సాయి కిరణ్, నాయకులు. అనంత రెడ్డి, దామోదర్ రావు, రాజిరెడ్డి, మోహన్ రెడ్డి, సంపత్, సీఈవో సతీష్, పిఎసిఎస్ పాలకవర్గ సభ్యులు, రైతులు, తదితరులున్నారు.

విద్యార్థులకు దీపావళి భద్రతపై అవగాహన

రామాయంపేట మెదక్ జిల్లా రామాయంపేట పట్టణంలోని ప్రభుత్వ మరియు ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు దీపావళి పండుగ సందర్భంగా భద్రతా అవగాహన కార్యక్రమాన్ని అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు బాణసంచా కాల్చేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు అగ్ని ప్రమాదాల నివారణ చర్యలు ప్రమాదాలు జరిగినప్పుడు అప్రమత్తంగా వ్యవహరించాల్సిన విధానాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా అగ్నిమాపక శాఖ అధికారి నరేష్ మాట్లాడుతూ దీపావళి పండుగను ఆనందోత్సాహాలతో పాటు సురక్షితంగా జరుపుకోవాలని తెలిపారు.బాణసంచా కాల్చే సమయంలో తప్పనిసరిగా భద్రతా నియమాలు పాటించాలని నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు.విద్యార్థులు పెద్దల పర్యవేక్షణలోనే బాణసంచా కాల్చాలని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.పండుగ సమయంలో అగ్ని ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని భద్రతా నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని వివరించారు.ఈ కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులు అగ్నిమాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓటమిపై స్పందించిన ఏబీ వెంకటేశ్వరరావు..



విజయవాడ విజయవాడ కార్పొరేషన్ పీఠాన్ని కూటమి కైవసం చేసుకుంది.. మేయర్ అభ్యర్థిగా జనసేన పార్టీ నుంచి పోటీచేసిన వంగవీటి రాధాకృష్ణ గెలిచారు. రాధాకి మొత్తం 2,65,888 ఓట్లు రాగా.. 1,30,872 మెజార్టీ లభించింది. వైఎస్సార్సీపీ అభ్యర్థి రాయన భాగ్యలక్ష్మికి 1,35,016 ఓట్లు, స్వతంత్ర అభ్యర్థి, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు కు 12,642 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఆయనకు సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్ పార్టీల మద్దతు కూడా తెలిపాయి.. కానీ డిపాజిట్ కూడా దక్కలేదు. తన ఓటమిపై ఏబీ వెంకటేశ్వరరావు స్పందించారు.తనకు ఓటు వేసిన 12,671 మందికి హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను అన్నారు. డబ్బు, కులం, మతంతో సంబంధం లేకుండా నగరంలోని అన్ని ప్రాంతాల వారు ఓటేసి తనను ఆదరించినందుకు ఎప్పటికీ ఋణపడి ఉంటానన్నారు. అందరి ప్రతినిధిగా విజయవాడ ప్రజల సమస్యలను లేవనెత్తుతూ పరిష్కారాల కోసం ప్రయత్నిస్తూనే ఉంటానన్నారు. 'ఈ నా మొట్టమొదటి ఎన్నికల ప్రచారం మరపురాని అనుభూతిని, సాధారణ ప్రజలతో ఇంతకు ముందెప్పుడూ లేని బాంధవ్యాన్ని, ఎంతోమంది కొత్త మిత్రులను, సహచరులను ఇచ్చింది' అంటూ ఆనందం వ్యక్తం చేశారు.తన ఎన్నికల ప్రచారంలో స్వచ్ఛందంగా పాలు పంచుకున్న వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు ఏబీవీ. ఈ ప్రచారానికి ఆర్థిక సహాయం చేసిన వారందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజలు స్వచ్ఛందంగా ఇచ్చిన విరాళం వృధా కాకుండా ఖర్చు చేసాము, చేస్తామని, ప్రజలకు పనికొచ్చే, ప్రజలకు అవసరమైన, రాజకీయ పార్టీని ఏర్పాటు చేస్తామని వాగ్దానం చేస్తున్నానన్నారు. మూస, కుమ్మక్కు రాజకీయాలకు భిన్నంగా పారదర్శక, అవినీతి లేని ఆధునిక వ్యవస్థలను నిర్మించడానికి ముందడుగు వేస్తామన్నారు. మన భావి తరాల కోసం, ఈ సుదీర్ఘ ప్రయాణంలో అందరూ కలసి రావాలని కోరుతున్నాను అంటూ ఆయన పోస్ట్ పెట్టారు. అలాగే విజయవాడ మేయర్‌గా ఘన విజయం సాధించిన వంగవీటి రాధాకృష్ణకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఏబీ వెంకటేశ్వరరావు తన పోస్ట్‌లో కొత్త పార్టీ పెడతానని మరోసారి స్పష్టం చేశారు. గతంలో కొత్త పార్టీ గురించి చెప్పిన మాటపై మరోసారి స్పష్టత ఇచ్చారు.

కేసీఆర్ మళ్లీ సీఎం కావాలి
సాగునీటి కోసం సైకిల్ యాత్ర!

అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో సాగునీటి సమస్యలు మళ్లీ తీవ్రమయ్యాయని ఆరోపించారు. ఎండిపోయిన పరి కంకులను కేసీఆర్‌కు చూపిస్తూ రైతన్నల దీనస్థితిని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాల కారణంగా వ్యవసాయంతో పాటు తెలంగాణలోని ఇతర రంగాలు కూడా దెబ్బతింటున్నాయని తమ యాత్రలో ప్రజలు ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిపారు.

కేసీఆర్ పాలనే శరణ్యం..

రైతుల ఆత్మహత్యలను నివారించి, తెలంగాణ వ్యవసాయాన్ని మళ్లీ గాడిలో పెట్టాలంటే కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాలని ప్రజలు కోరుకుంటున్నారని యాత్రికులు తెలిపారు. రైతులు, మహిళలు, వివిధ వృత్తి కులాలకు చెందిన సామాన్యులు తమ అభిప్రాయాలను వెల్లడించారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందని, రేవంత్‌రెడ్డి అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని వివరించారు. కాంగ్రెస్‌కు ఓటు వేసి తప్పు చేశామనే భావన పలువురిలో కనిపించిందని కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా సైకిల్ యాత్రికులు గోదావరి జలాలను కేసీఆర్‌కు అందజేశారు. ప్రజల అభిప్రాయాలను తెలుసుకుంటూ యాత్ర చేపట్టిన బొడ్డు రవీందర్ బృందాన్ని కేసీఆర్ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల ఆకాంక్షలు నెరవేరుతాయని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

యాత్రలో పాల్గొన్నవారు వీరే..

ఈ సైకిల్ యాత్రలో ఉప్పు రాజ్‌కుమార్, కాసిపాక వాసు, ఆరేపల్లి సరీష్, మేకల నవీన్‌కుమార్, పారిపల్లి అనిల్‌కుమార్, గుండెవేన శ్రీనివాస్ యాదవ్, మంచినీళ్ల రాకేష్, ముత్యం లక్ష్మణ్ గౌడ్, అమ్ము కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ విద్యుత్ నియంత్రణ మండలికి కొత్త సారథి
ఏపీఈఆర్సీ నూతన చైర్మన్‌గా బినోయ్ కుమార్

- విశ్రాంత ఐఏఎస్ అధికారికి కీలక బాధ్యతలు
- ఐదేళ్లు లేదా 70 ఏళ్ల వయస్సు వరకు పదవీకాలం
- ఈ మేరకు రాష్ట్ర ఇంధన శాఖ ఉత్తర్వుల జారీ

విజయవాడ,ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) నూతన చైర్మన్‌గా విశ్రాంత ఐఏఎస్ అధికారి బినోయ్ కుమార్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ఇంధన శాఖ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన పదవీ బాధ్యతలు చేపట్టిన తేదీ నుంచి ఐదేళ్ల పాటు లేదా 70 ఏళ్ల వయస్సు నిండే వరకు (ఈ రెండింటిలో ఏది ముందైతే అది) ఆ పదవిలో కొనసాగుతారు.బినోయ్ కుమార్‌కు పరిపాలనా రంగంలో విశేష అనుభవం ఉంది. ఆయన మూడు దశాబ్దాలకు పైగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సర్వీసుల్లో పలు కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ముఖ్యంగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2012-13 మధ్య కాలంలో ముఖ్యమంత్రికి ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. విద్యుత్ రంగంలో సంస్కరణలు తీసుకురావడం, నిర్వహణ సామర్థ్యాన్ని పెంపొందించడం వంటి అంశాలపై ఆయనకు లోతైన అవగాహన ఉంది.

హైదరాబాద్‌లో భారీ నకిలీ కరెన్సీ ముఠా గుట్టురట్టు

- నలుగురి అరెస్టు

హైదరాబాద్: నగరంలో భారీ నకిలీ కరెన్సీ ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. ఏకంగా రూ.6.78 కోట్ల విలువైన నకిలీ నోట్లను స్వాధీనం చేసుకుని, ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న నలుగురిని అరెస్టు చేశారు. మడుపోజు కర్ణాకర్, చిన్నోళ్ల మాణిక్య రెడ్డి, చెరుకుపెల్లి రత్నాకర్ రెడ్డి, కరణ అజయ్ కుమార్‌లను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ.500 నకిలీ నోట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠాకు చెందిన మరో ముగ్గురు పరారీలో ఉండటంతో వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు. నవంబర్ 1న అందిన పక్కా సమాచారంతో అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. రామోజీ ఫిల్మ్ సిటీ సమీపంలో అనుమానాస్పదంగా కనిపించిన కారును ఆపి తనిఖీ చేయగా, అందులో రూ.8 లక్షల విలువైన నకిలీ నోట్లు బయటపడ్డాయి. కారులో నకిలీ పోలీసు గుర్తింపు కార్డులు, బొమ్మ తుపాకీ, హ్యాండ్‌గన్‌లు, నాలుగు మొబైల్ ఫోన్లను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను విచారించగా హైదరాబాద్ సమీపంలోని కుంట్లూరులో నకిలీ నోట్ల తయారీ కేంద్రం నిర్వహిస్తున్నట్లు వెల్లడైంది. దీంతో అక్కడ తనిఖీలు చేపట్టిన పోలీసులు మరో రూ.6.70 కోట్ల విలువైన నకిలీ నోట్లను గుర్తించారు. నోట్ల తయారీకి ఉపయోగిస్తున్న ప్రింటర్లు, ల్యాప్‌టాప్, లామినేషన్ మెషీన్, పేపర్ కటింగ్ మెషీన్ తదితర పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల విచారణలో ఈ ముఠా నకిలీ నోట్ల తయారీ కోసం యూట్యూబ్ వీడియోలు, సోషల్ మీడియాను ఆశ్రయించినట్లు వెల్లడైంది. అసలు నోట్లను స్కాన్ చేసి, కంప్యూటర్‌లో మార్పులు చేసి నకిలీ నోట్లను ముద్రించినట్లు పోలీసులు గుర్తించారు. మొదట నకిలీ నోట్లను నేరుగా మార్కెట్లో చలామణి చేసేందుకు ప్రయత్నించినప్పటికీ విఫలమయ్యారు. దీంతో ప్రజలను మోసం చేసేందుకు కొత్త పద్ధతిని ఎంచుకున్నారు. తక్కువ ధరకు ఎక్కువ మొత్తంలో నకిలీ నోట్లు ఇస్తామని ఆశ చూపుతూ వ్యక్తులను సంప్రదించేవారు. నమ్మకం కలిగించేందుకు మొదట అసలు నోట్లను చూపించి, ఆ తర్వాత డబ్బులు తీసుకుని మోసానికి పాల్పడేవారు. ఈ మోసాలకు పోలీసుల పేరును కూడా ఉపయోగించుకున్నారు. నకిలీ నంబర్ ప్లేట్లు ఉన్న వాహనాల్లో తిరుగుతూ, తాము పోలీసు అధికారులమని నమ్మించేందుకు నకిలీ గుర్తింపు కార్డులు, మైక్రోఫోన్లు, బొమ్మ తుపాకులను వినియోగించేవారు. నకిలీ నోట్లు కొనుగోలు చేసేందుకు వచ్చిన వారిని పోలీసులమంటూ బెదిరించి, వారి వద్ద ఉన్న డబ్బును దోచుకుని పరారయ్యేవారు. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు, షాద్‌నగర్ స్పెషల్ ఆపరేషన్స్ బృందం సంయుక్తంగా ఈ ముఠాను పట్టుకున్నాయి. పరారీలో ఉన్న మరో ముగ్గురి కోసం గాలింపు కొనసాగుతోందని ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి వెల్లడించారు. ఈ నకిలీ కరెన్సీ తయారీ, మోసాల వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా అనే కోణంలోనూ దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు.

అల్వాల్ రైతుబజార్ను తొలగించవద్దు

- రైతుల జీవనోపాధిని కాపాడాలి - ఎంపి ఈటలకు రైతుల విన్నపం

మేడ్చల్ అల్వాల్ రైతుబజార్ను తొలగిస్తే 1,500 రైతు కుటుంబాలకు నష్టం కలుగుతుందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ను రైతులు కలిసారు. అల్వాల్ రైతుబజార్ను ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం కోసం తొలగించనున్న నేపథ్యంలో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతుబజార్పై ఆధారపడిన సుమారు 1,500 రైతు కుటుంబాల జీవనోపాధిని కాపాడాలని ఎంపీ ఈటల రాజేందర్కు వినతిపత్రం అందజేశారు.

మేడ్చల్, సిద్దిపేట, మెదక్, నల్గొండ జిల్లాల గ్రామాల నుంచి రైతులు ఇక్కడికి కూరగాయలు తీసుకొస్తున్నారు. ప్రతిరోజూ సుమారు 1,000 నుంచి 1,500 మంది రైతులు, వివిధ ప్రాంతాల నుంచి కూరగాయల విక్రయాలకు వస్తున్నట్లు పేర్కొన్నారు. 1999 జనవరి 26 నుంచి సుమారు 26 ఏళ్లుగా రైతుబజార్ రైతులకు జీవనాధారంగా కొనసాగుతోందని తెలిపారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా రైతులు నేరుగా వినియోగదారులకు తక్కువ ధరలకు కూరగాయలు విక్రయిస్తున్నారని వివరించారు. రైతుబజార్ను తొలగించే పరిస్థితి ఉంటే అల్వాల్ పరిసర ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ స్థలం కేటాయించి రైతుల జీవనోపాధిని కాపాడాలని ఈటలను విజ్ఞప్తి చేశారు.

ఒంగోలులో భారీ దారి దోపిడీ..

- 2 కేజీల బంగారంతో ఉడాయింపు

ఒంగోలు : ఒంగోలులో బుధవారం ఉదయం భారీ దారి దోపిడీ జరిగింది. తమిళనాడులోని కోయంబత్తూరు నుంచి ఒంగోలులోని నగల దుకాణాలకు బంగారం తీసుకెళ్తున్న వ్యాపారులను కొందరు వ్యక్తులు మార్గమధ్యంలో అపహరించి దోపిడీకి పాల్పడ్డారు. ఒంగోలు రైల్వేస్టేషన్‌లో దిగి ఆటోలో వెళుతున్న వ్యాపారులను స్థానిక ఉపాస్ ఆస్పత్రి సమీపంలో కారును అడ్డుపెట్టి అటకాయించారు.
వ్యాపారులను బలవంతంగా ఆటో నుంచి బయటికి లాగి తమ కారులో ఎక్కించుకొని దక్షిణ బైపాస్ సమీపంలోని డీ6 ఎక్స్‌టెన్షన్ ప్రాంతానికి తీసుకెళ్లారు. అక్కడ వారిపై దాడి చేసి సుమారు 2 కేజీల బంగారు ఆభరణాలను దోచుకుని ఉడాయించారు. ప్రాణా లతో బయటపడిన వ్యాపారులు గాంధీరోడ్డుకు చేరుకొని దోపిడీ జరిగిన విషయాన్ని స్థానిక బంగారు వ్యాపారులకు తెలియజేశారు. వారి సహకారంతో రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు. ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, సీఐ వీరానాయక్ ఆధ్వర్యంలో పోలీసులు రంగంలోకి దిగారు. సెంట్రల్ క్రైమ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కమలాకర్ ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందాలు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టాయి.

రెఫరండంగా మారుతొన్న ఎన్నికలు

గుంటూరు : తాజాగా జరిగిన స్థానిక సంస్థల పోలింగ్ ఒకరకంగా ఫస్ట్ ఎపిసోడ్‌గానే చూడాలి. ఎందుకంటే.. అన్ని పార్టీలకూ కీలకమైన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు ముందున్నాయి. అయితే.. ఈ ఎన్నికల్లో వాస్తవ పోలింగ్ శాతం గతంతో పోల్చుకుంటే బాగా తగ్గుముఖంపట్టింది. 2021లో జరిగిన స్థానిక ఎన్నికల్లో 69 శాతం మేరకు పోలింగ్ నమోదైంది. దీనితో పోల్చుకుంటే.. ఇప్పుడు సగటున 55 శాతం పోలింగ్ మాత్రమే నమోదైంది. ఈ పరిణామాలు.. అన్ని పార్టీలకూ అనేక విషయాలను నేర్పుతున్నాయని అంటున్నారు విశ్లేషకులు. ఏ పార్టీలో అయినా.. నాయకుల మధ్యకలివిడి ముఖ్యం. కూటమి పార్టీల్లో అధిష్టానాలు పదే పదే చెప్పినా.. ఈ తరహా కలివిడి లేని చోట చాలా వరకు ఓటింగ్ తగ్గిపోయింది. విశాఖ, విజయవాడ వంటి కీలక నగర పాలక సంస్థల పరిధిలో 50 శాతం ఓటు బ్యాంకు కూడా మించలేదు. దీనికి కారణం.. చివరి నిమిషం వరకు కూడా పార్టీలో ఐక్యత సాధించే ప్రయత్నం చేసినా.. దానిని అందుకోలేక పోవడమేనని అంటున్నారు. తద్వారా పోలింగ్‌పై ప్రజలు నిరాసక్తత చూపించారు. ఈ ఎన్నికలను రిఫరెండం అని కూటమి పార్టలు ప్రకటించకపోయినా.. సహజంగానే రెండున్న రేళ్ల ప్రభుత్వ పాలన తర్వాత.. వచ్చిన ఎన్నికలు కావడంతో అందరూ రిఫరెండంగానే భావిస్తారు. ఈ పరంగా చూసుకుంటే.. ఓటింగ్ శాతం తగ్గడంపై ప్రభుత్వం పునరాలోచన చేసుకోవాలని విశ్లేషకులు చెబుతున్నారు. కీలకమైన పథకాల విషయంలో జరుగుతున్న జాప్యం పెద్దగా ప్రభావం చూపిస్తోందన్నదివారి మాట. నిజానికి ఆర్టీసీ ఉచిత ప్రయాణం తీసుకువచ్చిన ఓట్లు కొంత మేరకు ప్రభుత్వానికి ప్లస్ అయ్యాయన్న వాదన కూడా ఉంది. ప్రజల్లో మార్పు: స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో ప్రజలు ఎక్కువగా ఆసక్తి చూపిస్తారు. అయితే.. ఈ సారి మా త్రం ఈ తరహా సంస్కృతి కొరవడింది. అదేసమయంలో ప్రచారానికి కూడా పెద్దగా గడువు లేకపోవడం, మధ్యలో తుఫాను బీభత్సం వంటివి కూడా ఈ ఎన్నికలపై ప్రభావం చూపించాయని అంటున్నారు. ఎలా చూసుకున్నా.. ప్రజల్లో కొంత నిరాసక్తత అయితే కనిపించింది. అంతాబాగానే ఉందని ప్రభుత్వం చెబుతున్నా.. ప్రస్తుతం జరిగిన ఓటింగ్ ను అంచనా వేయాల్సిన అవసరం ఉందన్నది పరిశీలకులు చెబుతున్నారు. అనంతరం మార్పుల దిశగా అడుగులు వేయాల్సి ఉంటుందని అంటున్నారు.

దిగొస్తున్న కూరగాయల ధరలు



హైదరాబాద్ : తెలుగు రాష్ట్రాల్లో కూరగాయల ధరలు దిగొస్తున్నాయి. వంటిల్లో రోజూ ఉపయోగించే టమాటా, ఉల్లిపాయలు ధరలు అదుపులో ఉన్నాయి. మొన్నటివరకు వీటి ధరలు భగ్గుమనగా.. ప్రస్తుతం స్థిరంగా కొనసాగుతున్నాయి. దీపావళి పండుగ సీజన్ క్రమంలో ధరలు చౌకకే దొరకడంతో సామాన్యులు ఊరట చెందుతున్నారు. ఎల్‌నినో ప్రభావం వల్ల ఇటీవల ధరలు పెరిగాయి. కూరగాయలకు డిమాండ్ ఉండటంతో ధరలు పెరిగాయి. అయితే ఇప్పుడు పంట మార్కెట్‌కు వస్తుండటంతో సరఫరా పెరిగింది. ఈ కారణంతో ధరలు తగ్గుతూ వస్తున్నాయి. దీంతో ఈ పరిణామం పండుగ వేళ సామాన్యుల ఇంటి బడ్జెట్‌ను తగ్గిస్తోంది. పండుగ సమయాల్లో ఇంట్లో ఖర్చులు ఎక్కువగా ఉంటాయి. కిరాణా సరుకుల అవసరం ఎక్కువగా ఉంటుంది. ఇక రకరకాల వంటలు వడేందుకు కూరగాయల అవసరం ఎక్కువగా ఉంటుంది. ధరలు తగ్గడం పండక్కి ముందే ఊరటగా కల్గిస్తోంది.కూకట్‌పల్లి మోడ్రన్ అండ్ మోడల్ రైతు బజార్‌లోని నవంబర్ 3వ తేదీన కిలో టమాట రూ. 29, వంకాయ రూ. 18, బెండకాయ రూ. 45, పచ్చిమిర్చి రూ. 45, బజ్జి మిర్చి రూ. 60, కాకరకాయ రూ. 35, బీరకాయ రూ. 35, క్యాబేజీ రూ. 13, బీన్స్ రూ. 55, క్యారెట్ రూ. 43, గోబీపువ్వు రూ. 25, దొండకాయ రూ. 23, చిక్కుడుకాయ రూ. 45, గోరుచిక్కుడు రూ. 35, బీట్‌రూట్ రూ. 19కు విక్రయిస్తున్నారు. ఇఖ క్యాప్సికమ్ రూ. 45, బంగాళాదుంప రూ. 19, కీర (లోకల్) రూ. 23, కీర (ఇటాలియన్) రూ. 35, దోసకాయ రూ. 18, సొరకాయ రూ. 20, పొట్లకాయ రూ. 22 పలుకుతున్నాయి. అలాగే కిలో కంద రూ. 35, ఉల్లికాడలు రూ. 55, ఉల్లిగడ్డ రూ. 40, పచ్చి మామిడికాయ ఒక్కొక్కటి రూ. 15-20, అరటికాయ ఒక్కొక్కటి రూ. 9-10, చామగడ్డ రూ. 35, ముల్లంగి ఒక్కొక్కటి రూ. 6-8, చిలగడదుంప రూ. 35, గుమ్మడికాయ రూ. 25, నిమ్మకాయలు డజను రూ. 50-60కు లభిస్తున్నాయి. అలాగే మునగకాయలు ఒక్కొక్కటి రూ. 8-10, బొప్పాయి రూ. 50, పుట్టగొడుగులు (200 గ్రా.) రూ. 50, ఎండుమిర్చి రూ. 280, పాత అల్లం రూ. 180, కొత్త అల్లం రూ. 120, వెల్లుల్లి రూ. 260, చింతపండు రూ. 160, పండుమిర్చి రూ. 80, ఉసిరి రూ. 45, కరివేపాకు రూ. 80, పర్వల్ రూ. 28, పల్లికాయ రూ. 55, లోబియా రూ. 28, ఆగాకరకాయ కిలో రూ. 85గా ఉన్నాయి.విజయవాడలోని రైతు బజార్లలో కిలో టమాట రూ.39, బెండ రూ.24, పచ్చిమిర్చి రూ.34, కాకర రూ.34, క్యాబేజీ రూ.24, క్యారెట్ రూ.45, దొండ రూ.24, బంగాళదుంప రూ.25, ఉల్లిపాయలు రూ.39, గోరుచిక్కుళ్లు రూ.32, దోస రూ.20, చామదుంప రూ.34, అల్లం రూ.76, కంద రూ.34, బీట్ రూట్ రూ.36, కీరదోస రూ.46, బీన్స్ రూ.105, క్యాప్సికం రూ.60, చింతకాయలు రూ.100 పలుకుతున్నాయి

ఓట్ల చీలిక ఎవరికి దెబ్బ

లక్నో : యూపీలో భారతీయ జనతా పార్టీ రాజకీయ ఆధిపత్యానికి మునుపెన్నడూ లేనంతగా సవాళ్లు ఎదురవుతున్నాయి. జాతీయ భద్రత, బలమైన కేంద్ర నాయకత్వం ప్రధాన అజెండాగా సాగిన లోక్‌సభ ఎన్నికల్లోనే యూపీ ఓటర్లు బీజేపీకి ఊహించని షాక్ ఇవ్వడం పార్టీకి మేల్కొలుపుగా మారింది. దాదాపు దశాబ్ద కాలంగా అధికారంలో ఉన్న యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని డబుల్ ఇంజిన్ సర్కార్‌పై పాలనాపరమైన అసంతృప్తి క్షేత్రస్థాయిలో విస్తరిస్తోందన్న సంకేతాలు వెలువడుతున్నాయి. జాతీయ నినాదాలే పూర్తిస్థాయిలో ప్రభావం చూపలేకపోయిన తరుణంలో, పూర్తిగా స్థానిక, సామాజిక అంశాల చుట్టూ తిరిగే అసెంబ్లీ సమరంలో కమలనాథులకు పెను పరీక్ష తప్పేలా లేదు.యోగి ప్రభుత్వంపై పెరుగుతున్న అసంతృప్తికి ప్రధానంగా నిరుద్యోగం, ప్రభుత్వ ఉద్యోగ పరీక్షల పేపర్ లీకేజీలు, వ్యవసాయ సంక్షోభం, పెరిగిపోయిన ద్రవ్యోల్బణం వంటి క్షేత్రస్థాయి సమస్యలే ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి. వీటికితోడు శాంతిభద్రతల పేరిట జరిగిన కొన్ని కఠిన చర్యలు, బుల్డోజర్ న్యాయం కొన్ని సామాజిక వర్గాల్లో భయాందోళనలను, వ్యతిరేకతను పెంచాయి. ముఖ్యంగా ఓబీసీ, దళిత వర్గాలలో ప్రభుత్వ ప్రాధాన్యతలపై తలెత్తిన అనుమానాలు బీజేపీ సాంప్రదాయ ఓటు బ్యాంకులో చీలిక తెచ్చాయి. మరోవైపు ప్రభుత్వ యంత్రాంగం , పార్టీ క్యాడర్ మధ్య సమన్వయ లోపం, మంత్రులు-ఉపముఖ్యమంత్రుల మధ్య తలెత్తిన అంతర్గత విభేదాలు కూడా పాలనపై ప్రభావం చూపుతున్నాయి.ఈ రాజకీయ శూన్యతను సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ అత్యంత చాకచక్యంగా తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారు. గతంలో ఉన్న కేవలం యాదవ-ముస్లిం సమీకరణ పరిధిని దాటి, ఆయన ప్రయోగించిన పీడీఏ వెనుకబడిన, దళిత, మైనారిటీ వర్గాలు సామాజిక ఫార్ములా క్షేత్రస్థాయిలో విస్తృత ఆదరణ పొందుతోంది. రాజ్యాంగ పరిరక్షణ, కులగణన, రిజర్వేషన్ల హక్కుల పరిరక్షణను ప్రధాన అజెండాగా మార్చి అఖిలేష్ నిరంతరం ప్రజల్లో ఉండటం సమాజ్‌వాదీ పార్టీ శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపింది. బహుజన్ సమాజ్ పార్టీ ప్రభావం గణనీయంగా తగ్గడంతో, బీజేపీ వ్యతిరేక ఓటుకు ఎస్పీయే ఏకైక ప్రత్యామ్నాయంగా నిలవడం అఖిలేష్ రాజకీయ గ్రాఫ్‌ను భారీగా పెంచింది.అయితే రాబోయే రాజకీయ పోరులో బీజేపీని ఎదుర్కోవడం అఖిలేష్‌కు నల్లేరుపై నడకేమీ కాదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. యోగి ఆదిత్యనాథ్‌కు వ్యక్తిగతంగా ఉన్న బలమైన హిందుత్వ ఇమేజ్, బీజేపీకి ఉన్న పటిష్టమైన బూత్ స్థాయి నెట్‌వర్క్, కేంద్ర పథకాల లబ్ధిదారుల వర్గం ఇప్పటికీ కాషాయ పార్టీకి కొండంత అండగా ఉన్నాయి. లోక్‌సభ ఎదురుదెబ్బల తర్వాత బీజేపీ సైతం దిద్దుబాటు చర్యలు చేపడుతూ, నాన్-యాదవ్ ఓబీసీలు, దళిత వర్గాలను తిరిగి ఆకర్షించేందుకు వ్యూహాత్మక మార్పులు చేస్తోంది. అఖిలేష్ హవా కొనసాగుతున్నప్పటికీ, తీవ్రస్థాయికి చేరిన ప్రభుత్వ వ్యతిరేకతను తన సంకీర్ణ కూటమి ద్వారా అసెంబ్లీ సీట్లుగా ఎంత వరకు మలచగలరన్న దానిపైనే యూపీ తదుపరి రాజకీయ భవితవ్యం ఆధారపడి ఉంటుంది.

దుమ్మురేపిన రెబల్స్

విజయవాడ : ఏపీ మున్సిపల్ ఎన్నికల్లో పలు చోట్ల రెబల్ అభ్యర్థులు ట్విస్ట్ ఇచ్చారు. టికెట్ దక్కలేదని వెనక్కి తగ్గకుండా.. స్వతంత్రులుగా బరిలోకి దిగి ప్రధాన పార్టీల అభ్యర్థులకు షాక్ ఇచ్చారు. ఆదోనిలో జనసేన రెబల్ ఏకంగా చైర్‌పర్సన్ స్థానాన్నే దక్కించుకోవడం హాట్ టాపిక్‌గా మారింది. ఏపీ మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో రెబల్ అభ్యర్థులు ఊహించని విధంగా సత్తా చాటారు. పార్టీల టికెట్లు దక్కకపోయినా.. స్వతంత్రులుగా బరిలోకి దిగి ఓటర్ల మద్దతుతో విజయం సాధించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం మున్సిపాలిటీలో జనసేన చైర్మన్ పీఠాన్ని దక్కించుకుంది. మొత్తం 36 వార్డులున్న పిఠాపురంలో ఏకంగా పది వార్డుల్లో స్వతంత్ర అభ్యర్థులు విజయం సాధించారు. దీంతో రెబల్స్ గెలుపు స్థానిక రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా ఆదోని మున్సిపల్ ఎన్నికల్లో జనసేన రెబల్ అభ్యర్థి గెలిచి ఈ ఎన్నికల్లో చరిత్ర సృష్టించారు.ఇక కర్నూలు జిల్లా ఆదోని మున్సిపల్ ఎన్నికల్లో మరో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. జనసేన రెబల్ అభ్యర్థిగా బరిలోకి దిగిన స్వప్న మల్లప్ప నాయకర్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి చైర్‌పర్సన్ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. కూటమి సీట్ల సర్దుబాటులో భాగంగా ఆదోని చైర్‌పర్సన్ స్థానం టీడీపీకి కేటాయించారు. నాగమణిని టీడీపీ అభ్యర్థిగా ఖరారు చేశారు. దీంతో జనసేన ఆదోని ఇన్‌చార్జి మల్లప్ప నాయకర్ తన భార్య స్వప్నను స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దించారు. చివరకు ఆమె విజయం సాధించడంతో ఆదోని రాజకీయాల్లో ఈ ఎన్నిక ప్రత్యేకంగా నిలిచింది. స్వప్న భర్త మల్లప్ప నాయకర్ మాట్లాడుతూ.. స్వప్న గెలుపును పవన్ కళ్యాణ్‌కు బహుమతిగా ఇస్తున్నామని పేర్కొన్నారు. తాను ఎప్పటికీ పవన్ అభిమానిని అని.. ఆయనతోనే ఉంటానని పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్ తనకు అండగా ఉన్నారన్నారు..పిఠాపురం నియోజకవర్గంలోని గొల్లప్రోలులోనూ స్వతంత్ర అభ్యర్థులు పార్టీలకు షాక్ ఇచ్చారు. నాలుగు వార్డుల్లో రెబల్ అభ్యర్థులు విజయం సాధించారు. ఇద్దరు జనసేన రెబల్స్, ఇద్దరు టీడీపీ రెబల్ అభ్యర్థులు బరిలో నిలిచి గెలిచారు. ఇక ఏలూరు మున్సిపల్ ఎన్నికల్లోనూ స్వతంత్ర అభ్యర్థులు ప్రభావం చూపించారు. దాదాపు ఎనిమిది మంది ఇండిపెండెంట్లు విజయం సాధించారు.మొత్తంగా ఏపీ మున్సిపల్ ఎన్నికల్లో రెబల్ అభ్యర్థుల గెలుపు ప్రధాన పార్టీలకు కొత్త రాజకీయ సమీకరణాలను తెరపైకి తెచ్చింది. పిఠాపురం, గొల్లప్రోలు, ఏలూరులో కార్పొరేటర్, కౌన్సిలర్ స్థాయిలో రెబల్స్ సత్తా చాటగా.. ఆదోనిలో ఏకంగా చైర్‌పర్సన్ స్థానాన్ని రెబల్‌గా బరిలోకి దిగిన అభ్యర్థి సొంతం చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది.

చదువుకు శ్రీరామ్ ఫైనాన్స్ అండ

- 67 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు
- ప్రతిభావంతుల భవిష్యత్తుకు ఆర్థిక భరోసా



మహబూబాబాద్ పేదరికం ప్రతిభకు అడ్డు కాకూడదనే లక్ష్యంతో శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ విద్యార్థులకు అండగా నిలిచింది.సామాజిక బాధ్యతలో భాగంగా పట్టణానికి చెందిన 67 మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.4,000 నుంచి రూ.4,500 వరకు స్కాలర్‌షిప్‌లు అందించి ప్రోత్సహించింది.హౌసింగ్ బోర్డు రెడ్డి కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి మహబూబాబాద్ బ్రాంచ్ మేనేజర్ పిరమళ్ల శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా జేసీబీ అధ్యక్షుడు గార్లపాటి మహిపాల్ రెడ్డి, మారుతి సుజుకి మేనేజర్ శ్రీనాథ్ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా మేనేజర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. 8వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థులకు సహాయం అందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడమే తమ ఉద్దేశమని, వచ్చే ఏడాది మరింత మందికి స్కాలర్‌షిప్‌లు అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హాల్ అధ్యక్షుడు మోహన్ రెడ్డి, బిజినెస్ మేనేజర్ మెరుగు భీమ్ రాజ్ తో పాటు సంస్థ ప్రతినిధులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తిరుమల శ్రీవారి మెట్లపై గుండెపోటుతో ఎన్నారై మృతి



తిరుమల శ్రీవారి దర్శనానికి శ్రీవారి మెట్టు నడక మార్గంలో వెళ్తున్న భక్తుడు గుండెపోటుతో మృతిచెందాడు. 800వ మెట్టు వద్ద సింగిరెడ్డి సుర్జిత్ రెడ్డి అకస్మాత్తుగా గుండెపోటుకు గురై కుప్పకూలాడు. భద్రతా సిబ్బంది అతడిని కిందకు తీసుకొచ్చారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు
నిర్ధారించారు. చంద్రగిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తుఫాను ప్రభావంతో విరిగిపడిన చెట్లను, కాలువలను స్వయంగా పరిశీలించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

- యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశం
- ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని స్పష్టీకరణ

నరసరావుపేట : మురసు తుఫాను ప్రభావంతో నిన్న కురిసిన భారీ వర్షాలకు నరసరావుపేట నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో నెలకొన్న పరిస్థితులపై స్థానిక శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు స్వయంగా రంగంలోకి దిగారు. వర్షం, ఈదురు గాలుల ధాటికి రోడ్లపై విరిగిపడిన భారీ వృక్షాలు, వర్షపు నీటితో నిండిన డ్రైనేజీ కాలువలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పురపాలక, విద్యుత్ మరియు రెవెన్యూ శాఖల అధికారులను అప్రమత్తం చేశారు. ప్రధాన రహదారులపై రాకపోకలకు అంతరాయం కలగకుండా కూలిపోయిన చెట్లను, కొమ్మలను వెంటనే తొలగించాలని యంత్రాంగాన్ని ఆదేశించారు. నీరు నిలిచిపోయే అవకాశం ఉన్న లోతట్టు ప్రాంతాల్లోని కాలువల్లో పూడికతీత పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయించి, వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. పనుల పురోగతిని ఆయన స్వయంగా దగ్గరుండి పర్యవేక్షించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, తుఫాను మరియు భారీ వర్షాల కారణంగా నియోజకవర్గ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని చెప్పారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, ఏ సమస్య వచ్చినా స్థానిక యంత్రాంగానికి సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ పరిశీలన కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, వివిధ శాఖల సిబ్బంది మరియు నాయకులు పాల్గొన్నారు.

కేసీఆర్‌కు పేరు వస్తుందనే నీళ్లివ్వడం లేదు

- వేముల ప్రశాంత్ రెడ్డి



హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ బాన్సువాడ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్నది కాలం తెచ్చిన కరవు కాదని, ఇది పూర్తిగా కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిపెట్టిన కరవని ఆయన విమర్శించారు. పలువురు బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలతో కూడిన ప్రతినిధి బృందం భూపాలపల్లి జిల్లా మహదేవపూర్‌లోని మేడిగడ్డ బ్యారేజీని సందర్శించింది. ఈ సందర్భంగా బ్యారేజీ స్థితిగతులను, నీటి లభ్యతను వారు పరిశీలించారు.అనంతరం వేముల ప్రశాంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ... కేసీఆర్‌కు మంచి పేరు వస్తుందన్న కుట్రతోనే కాంగ్రెస్ ప్రభుత్వం మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తిపోయడం లేదని ఆరోపించారు. బ్యారేజీ వద్ద పుష్కలంగా నీరు అందుబాటులో ఉన్నప్పటికీ, వాటిని ఉద్దేశపూర్వకంగా సముద్రం పాలు చేస్తున్నారని మండిపడ్డారు. నిత్యం సుమారు 22,000 క్యూసెక్కుల నీరు వృథాగా పోతోందని, ఈ నీటిని పంపింగ్ చేస్తే రైతుల పంటలను కాపాడవచ్చని ఆయన అన్నారు. బ్యారేజీ కూలిపోయిందని ప్రభుత్వం చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని, 85 పిల్లర్లు పటిష్ఠంగానే ఉన్నాయని ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి నీటిని ఎత్తిపోయకపోతే, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాయకత్వంలో పెద్ద ఎత్తున 'రైతు పోరుబాట' నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ పర్యటనలో మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, గంప గోవర్ధన్, జీవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏబీ వెంకటేశ్వరరావుకు ఎన్నికల్లో తీవ్ర నిరాశ..

- డిపాజిట్ గల్లంతు
- విజయవాడ మేయర్ ఎన్నికల్లో ఏబీవీ ఘోర పరాజయం
- ప్రధాన పార్టీలకు దీటుగా ప్రచారం చేసినా ఫలితం శూన్యం
- వామపక్షాలు, కాంగ్రెస్ మద్దతిచ్చినా దక్కని ఓట్లు



విజయవాడ విశ్రాంత ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావుకు మున్సిపల్ ఎన్నికల్లో తీవ్ర నిరాశ ఎదురైంది. ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టిన ఆయన... తాను ఎదుర్కొన్న తొలి ఎన్నికల్లోనే చేదు అనుభవాన్ని మూటగట్టుకున్నారు. విజయవాడ మేయర్ ఎన్నికల్లో ఘోర పరాభవాన్ని చవి చూశారు. ప్రధాన పార్టీలకు దీటుగా విస్తృతంగా ప్రచారాన్ని నిర్వహించినప్పటికీ, ఆయన కనీసం డిపాజిట్ కూడా దక్కించుకోలేకపోయారు. సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్ పార్టీల మద్దతుతో బరిలోకి దిగిన ఆయన, ఓట్ల సాధనలో మాత్రం పూర్తిగా వెనకబడ్డారు.నగరంలోని మూడు నియోజక వర్గాల్లో విస్తృతంగా పర్యటించి ప్రచారం చేపట్టిన ఏబీ వెంకటేశ్వరరావు గౌరవప్రదమైన ఓట్లు సాధించడంలో పూర్తిగా విఫలమయ్యారు. అర్ధరాత్రి 1.30 గంటలకు వెలువడిన ఫలితాల్లో ఆయనకు కేవలం 11,137 ఓట్లు మాత్రమే సాధించారు.ఈ ఫలితాలు వామపక్షాల ఓటు బ్యాంకు కూడా ఆయనకు బదిలీ కాలేదనే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. కూటమిగా ఏర్పడి మద్దతు ప్రకటించినా, ఆ ఓట్లు ఏబీవీకి పడకపోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మా రింది. ప్రచారంలో చూపిన జోరు, ఫలితాల్లో కనిపించకపోవడంతో ఆయన వర్గీయులు నిరాశ చెందారు.

మార్కెట్‌లో రూ.9,500

- మిల్లులో రూ.8 వేలే..

ఉత్కర్ కాటన్ మిల్లులో పత్తి కొనుగోళ్లపై బీఆర్ఎస్ నాయకుల ఆగ్రహం



నర్వ: పత్తి పండించిన రైతుకు మార్కెట్‌లో ఆశించిన ధర దక్కడం లేదని బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నారాయణపేట జిల్లా నర్వ మండలం పాతర్చేడు గ్రామ పరిధిలోని ఉత్కర్ కాటన్ మిల్లులో క్వింటాల్ పత్తిని రూ.8 వేలకే కొనుగోలు చేస్తున్నారని, మార్కెట్‌లో మాత్రం రూ.9,500 ధర ఉందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. మార్కెట్ ధరకు, మిల్లులో చెల్లిస్తున్న ధరకు మధ్య క్వింటాల్‌కు రూ.1,500 వ్యత్యాసం ఉండటంతో రైతులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. పెట్టుబడులు పెట్టి పండిస్తే.. తక్కువ ధరకేనా?: పత్తి సాగు కోసం రైతులు భారీగా పెట్టుబడులు పెట్టి, ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొని పంటను పండిస్తున్నారని మహేశ్వర్ రెడ్డి అన్నారు. తీరా పంటను విక్రయించే సమయంలో తక్కువ ధర చెల్లిస్తే రైతులకు గిట్టుబాటు ఎలా అవుతుందని ప్రశ్నించారు. రైతుల శ్రమకు తగిన ప్రతిఫలం దక్కేలా క్వింటాల్ పత్తిని రూ.9,500 చొప్పున కొనుగోలు చేయాలని మిల్లు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. మిల్లులో పత్తి తూకంలోనూ మోసం జరుగుతోందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు స్పందించి కొనుగోళ్లను పర్యవేక్షించాలని, రైతులకు అన్యాయం జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు శ్రీనివాస్ రెడ్డి, బి. ఆంజనేయులు, పార్టీ కార్యకర్తలు ఈ డిమాండ్లు చేశారు.

జిల్లా కలెక్టర్ తో ఎమ్మెల్యే శ్రీగణేష్ భేటి

ఇందిరమ్మ ఇండ్లు, కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం పై సమీక్ష.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా ను కోరిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్.

కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే ధ్యేయంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ దూకుడు పెంచారు.ఇందులో భాగంగా బుధవారం లక్డికాపూల్లోని హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ప్రియాంక అలాను ఆయన ప్రత్యేకంగా కలిశారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న వివిధ అభివృద్ధి పనులపై సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా నిరుపేదల సొంతింటి కల అయిన 'ఇందిరమ్మ ఇండ్లు',ప్రజల సామాజిక అవసరాల కోసం 'కమ్యూనిటీ హాల్స్' నిర్మాణాలు వెంటనే ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.అన్ని విభాగాల అధికారులతో సమన్వయం చేసుకుంటూ,ప్రజలకు తక్షణ సేవలు అందేలా పనుల్లో వేగం పెంచేలా అలాగే నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమిస్తామని ఎమ్మెల్యే శ్రీగణేష్ స్పష్టం చేశారు.

సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గ లబ్ధిదారులకు ఇళ్ల కేటాయింపు:

పేదప్రజల సొంతింటి కలను నిజం చేయడమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'ఇందిరమ్మ ఇళ్ల' పథకం దిశగా మరో అడుగు పడింది. హైదరాబాద్‌లోని క్యూర్ హైదరాబాద్ పరిధిలో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల మాప్ అప్ ఈ-లాటరీ కార్యక్రమంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ పాల్గొని, ఈ పారదర్శక లాటరీ ప్రక్రియ ద్వారా ఇళ్లను దక్కించుకున్న సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన అర్హులైన లబ్ధిదారులందరికీ ఎమ్మెల్యే శ్రీగణేష్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నిరుపేద కుటుంబం గౌరవప్రదమైన జీవితాన్ని గడపాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు.అర్హులైన ప్రతీ ఒక్క పేదవాడికి ప్రభుత్వ పథకాలు అందేల చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే ఈ దీపావళికి కొత్త ఇంట్లో కళ కాంతులు విరజిమ్మి, వారి జీవితంలో ఆనందం ఆకాశాన్ని తాకాలని ఆయన కోరారు.

బోయిన్‌పల్లిలో ఘనంగా సదర్ సమ్మేళనం:

తెలంగాణ సాంస్కృతిక వైభవానికి,యాదవ సోదరుల ఐక్యతకు ప్రతీకగా నిలిచే"సదర్" వేడుకలు బోయిన్‌పల్లిలో అత్యంత ఘనంగా జరిగాయి.కాంగ్రెస్ నాయకులు బాలరాజు యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సదర్ వేడుకల్లో యాదవ సోదరులతో కలిసి ఎమ్మెల్యే శ్రీగణేష్ స్థానికులతో మమేకమయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరతరాలుగా వస్తున్న ఆచార వ్యవహారాలను, సంప్రదాయాలను కాపాడుకుంటూ వస్తున్న యాదవ సమాజం ఎంతో గొప్పదని ప్రశంసించారు. పశుసంపదను రక్షించడంలోనూ,పాడి పరిశ్రమ ద్వారా సమాజానికి పౌష్టికాహారాన్ని అందిస్తూ దేశ ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములవుతున్న యాదవుల సేవలు ఎనలేనివని కొనియాడారు. ఈ ఆనందకరమైన సందర్భంలో కంటోన్మెంట్ ప్రజలందరికీ,యాదవ సోదరులందరికీ ఎమ్మెల్యే శ్రీగణేష్ హృదయపూర్వక సదర్ సమ్మేళన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ కమిటీ సభ్యులు కృష్ణ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సదానంద్,వేణు తదితరులు పాల్గొన్నారు.



ఎడతెరిపి లేని వర్షాలు..

- పొంగిపొర్లుతున్న వాగులు..
- భద్రాద్రి జిల్లాలో జలమయమైన రహదారులు



ములకలపల్లి : మురసు తుఫాన్ ప్రభావంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలవ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ప్రధాన రహదారులు జలమయమవ్వగా.. లోతట్టు ప్రాంతాల్లోని పంట పొలాలు నీట మునిగాయి. పాల్వంచ నుంచి మాదారం మీదుగా అన్నపురెడ్డిపల్లి వెళ్లే ప్రధాన రహదారిపై సత్యంపేట గ్రామం వద్ద పాములేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. వంతెనపై నుంచి వరద నీరు పొంగిపొర్లుతుండటంతో ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. మరోవైపు పాల్వంచ నుంచి దమ్మపేట వెళ్లే ప్రధాన రహదారిపై రాజుపేట శివారులో పాములేరు వాగుపై ఇటీవల కూలిన వంతెన పక్కన ఏర్పాటు చేసిన తాత్కాలిక అప్రోచ్ కూడా వరద ఉధృతికి కొట్టుకుపోయింది. దీంతో ఈ రెండు మార్గాల్లో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు భారీ వర్షాలతో మండలంలోని లోతట్టు ప్రాంతాల్లో సాగు చేస్తున్న వరి, మిర్చి, పుచ్చ, శనగ తదితర పంటలు నీట మునుగుతున్నాయి. ఇప్పటికే వర్షాలతో ఇబ్బందులు పడుతున్న రైతులకు తాజా వర్షాలు మరింత నష్టం కలిగించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు ఇలాగే కొనసాగితే పంటలు పూర్తిగా దెబ్బతినే అవకాశం ఉందని ఆవేదన చెందుతున్నారు.

కండక్టర్ ప్రవళిక మృతి..

కుటుంబానికి అండగా ప్రభుత్వం

హైదరాబాద్ భద్రాద్రిలో బస్సులో చిల్లర విషయంలో జరిగిన గొడవలో ప్రయాణికురాలు తోసేయడంతో తీవ్రంగా గాయపడిన కండక్టర్ ప్రవళిక చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఈ ఘటనపై రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రగ్రాంతి వ్యక్తం చేశారు. హైదరాబాద్ లోని సాయి సంజీవని ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందించినా కాపాడుకోలేకపోయామని తెలిపారు. ప్రవళిక తల్లికి ఉద్యోగం, ఇందిరమ్మ ఇళ్లు, రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు.

మురసు తుపాను ప్రభావంతో

పల్నాడు జిల్లాలో భారీ వర్షాలు

చిలకలూరిపేట పట్టణంలో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. జాతీయ రహదారిని వరద ముంచెత్తడంతో పాటు, పలుచోట్ల విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. అయితే, అధికారులు ముందుజాగ్రత్త చర్యగా విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారుమరోవైపు, విజయవాడ నగరాన్ని కూడా వర్షం ముంచెత్తింది. గత 10 గంటలుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానతో నగరంలోని అనేక కాలనీలు, బస్తీలు జలమయమయ్యాయి. ప్రధాన రహదారులపై నీరు నిలిచిపోవడంతో ట్రాఫిక్ స్తంభించింది. గత అనుభవాల నేపథ్యంలో, బుడమేరు వాగుకు మళ్లీ వరద పోటెత్తుతుందేమోనని స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికార యంత్రాంగం సహాయక చర్యలపై దృష్టి సారించింది.

జగన్‌కు ఊపిరిచ్చిన ఎన్నికలు

అనంతపురం : ఆంధ్రప్రదేశ్ లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో జగన్ వ్యూహం ఒకరకంగా విజయవంతంమయినట్లేనని చెప్పాలి. ఎందుకంటే గత ఎన్నికల తరహాలో ఎన్నికలను బహిష్కరించకుండా క్యాడర్ లను, లీడర్లను ఎన్నికల బరిలోకి దింపడంతో ఒకరకంగా జగన్ సక్సెస్ అయినట్లే. తన క్యాడర్ ను పార్టీ జెండా పట్టుకుని వచ్చే సాధారణ ఎన్నికల వరకూ పోరాడగలిగేలా జగన్ ఈ ఎన్నికల ద్వారా సమాయత్తం చేయగలిగారు. నామినేషన్ల పర్వం నుంచి మొదలయిన రగడతో క్యాడర్ స్ట్రాంగ్ గా మారింది. ఎన్నికల ఫలితాల్లో గెలుపోటములతో సంబంధం లేకుండా, క్షేత్రస్థాయిలో పార్టీ ఉనికిని చాటుకోవడం మరియు క్యాడర్‌ను యాక్టివ్ చేయడంలో ఈ ఎన్నికలు కీలక పాత్ర పోషించాయని విశ్లేషకులు భావిస్తున్నారు. గత సాధారణ ఎన్నికల్లో వైసీపీ కేవలం పదకొండు స్థానాలకే పరిమితం కావడంతో క్యాడర్, లీడర్లలో నైరాశ్యం నిండుకుంది. కొందరయితే పార్టీని వీడి వెళుతున్న వారు, మరికొందరు తమ ఇళ్లకే పరిమితమయిన వారిలో ఫ్యాన్ పార్టీ ఉక్కపోతకు గురయిందని చెప్పాలి. అయితే స్థానిక సంస్థల ఎన్నికలను జగన్ చక్కగా వినియోగించుకున్నాడనిపిస్తోంది. స్తబ్దుగా ఉన్న క్యాడర్, లీడర్లలో ఆత్మస్థయిర్యం నింపింది. కొన్ని చోట్ల ప్రజలు వైసీపీకి పట్టం కట్టడంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం కూటమికి ఏకపక్షం కాదని ఈ ఎన్నికల ద్వారా జగన్ రుజువు చేసినట్లయింది. సార్వత్రిక ఎన్నికల ఓటమి తర్వాత స్తబ్దుగా ఉన్న పార్టీ శ్రేణుల్లో ఈ ఎన్నికలు కొత్త ఉత్సాహాన్ని నింపాయి. నాయకత్వం అండగా ఉంటుందనే నమ్మకాన్ని జగన్ కల్పించగలిగారు. పార్టీలోని అగ్రనాయకులు, ద్వితీయ శ్రేణి నాయకులు మరియు కార్యకర్తలు అంతా కలిసికట్టుగా పోరాడాల్సిన అవసరాన్ని ఈ ఎన్నికలు గుర్తుచేశాయి. దీనివల్ల అంతర్గత విభేదాలు పక్కన పెట్టి అందరూ ఏకమయ్యే పరిస్థితి వచ్చింది.? పోరాట పటిమను చాటడం: ఓటమిని చూసి కుంగిపోకుండా, అధికార పక్షాన్ని ఎదుర్కొంటూ ఎన్నికల బరిలో నిలవడం ద్వారా వైసీపీ తన ఉనికిని బలంగా చాటుకోగలిగింది. స్థానిక సంస్థల ఎన్నికల ద్వారా క్షేత్రస్థాయిలో పార్టీ యంత్రాంగాన్ని పునర్నిర్మించుకోవడానికి, లోపాలను సరిదిద్దుకోవడానికి జగన్‌కు ఒక మంచి అవకాశం లభించింది.రాజకీయాల్లో గెలుపు ఎంత ముఖ్యమో... ఓడినప్పుడు క్యాడర్ చేజారిపోకుండా కాపాడుకోవడం కూడా అంతే ముఖ్యం. ఆ కోణంలో చూస్తే, క్లిష్ట పరిస్థితుల్లో కూడా లీడర్లను, క్యాడర్‌ను ఏకతాటిపైకి తీసుకురావడంలో జగన్ వ్యూహం విజయవంతమైందని చెప్పవచ్చు.ఎన్నికల్లో ఓటమి ఎదురైనప్పటికీ, పార్టీ శ్రేణులు మరియు నాయకత్వం కలిసికట్టుగా ఉండటం జగన్ మోహన్ రెడ్డి సాధించిన విజయంగా కొందరు భావిస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై వైసీపీ అధినేత జగన్ ట్వీట్ చేశారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో చంద్రబాబు టీమ్, పోలీసులు, రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కు అభినందనలు తెలిపారు. నామినేషన్ల నుంచి పోలింగ్ వరకూ అంతా హైజాక్ చేశారని జగన్ ట్వీట్ లో పేర్కొన్నారు. ఇది ఎన్నిక కాదని... ఇది ఎన్నిక కాదని, అధికార పార్టీ ఎంపిక మాత్రమేనని వైఎస్ జగన్ అన్నారు. ప్రజలు అభ్యర్థులను ఎన్నుకోలేదని, ఎంపిక మాత్రమేనని అన్నారు. ప్రతిపక్షానికి పోటీ చేసే అవకాశమే దక్కినవ్వకుండా అధికార పార్టీ ఈ విజయాన్ని అందిపుచ్చుకుందని జగన్అన్నారు. ప్రతిపక్షానికి అవకాశమివ్వకుండా అధికారాన్ని చేజిక్కించుకోవడం ఎలాగో నిరూపించారు.క్లిష్ట సమయాల్లో కూడా క్షేత్రస్థాయిలో పార్టీ పట్టు కోల్పోకుండా, భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కావడంలో నాయకత్వం విజయవంతమైందని ఈ వర్గం విశ్లేషిస్తుంది. భేదాభిప్రాయాలు మరియు సవాళ్లను ఎత్తిచూపే వాదన: మరోవైపు, ఎన్నికల తర్వాతి పరిణామాలలో కొందరు కీలక నాయకులు పార్టీని వీడటం లేదా క్రియాశీల రాజకీయాలకు దూరం కావడం వంటి అంశాలను మరికొందరు గుర్తుచేస్తున్నారు. పార్టీని తిరిగి బలోపేతం చేయడానికి మరియు క్యాడర్‌లో పూర్తిస్థాయి నమ్మకాన్ని నింపడానికి ఇంకా చాలా శ్రమించాల్సి ఉందనే అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి.జగన్ ఇలాకాలో ఓటమి కడప జిల్లాలో వైసీపీకి ఘోర పరాజయం దక్కింది.

మొత్తం ఎనిమిది మున్సిపాలిటీల్లో వైసీపీ ఓటమి చవి చూసింది. ఉమ్మడి కడప జిల్లాలో దాదాపు అన్ని మున్సిపాలిటీల్లో వైసీపీ ఓటమి పాలయింది. బద్వేల్, రాజంపేట, మైదుకూరు, ప్రొద్దుటూరులో వైసీపీ ఓటమి చెందింది. అన్ని చోట్ల ఓటమి... కమలాపురం, జమ్మలమడుగు, యర్రగుంట్లలో వైసీపీకి పరాభవం ఎదురయింది. పులివెందుల మున్సిపాలిటీలోనూ వైసీపీకి ఘోర ఓటమి చవి చూసింది. మొత్తం మీద అన్ని చోట్ల పోటీ చేసిన వైసీపీకి ఘోర పరాభవం ఎదురు కావడాన్ని ఆ పార్టీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నారు.

ఓట్ల బదిలీ .. యధాతధాం...

మున్సిపల్ ఎన్నికల ఫలితాలు ఒక స్పష్టత నిచ్చాయి. ఇన్నాళ్లూ ఉన్న అనుమానాలు పటాపంచలయ్యాయి. చంద్రబాబు, పవన్ కల్యాణ్, మాధవ్ ల మధ్య పై స్థాయిలో సఖ్యత ఉన్నా కింది స్థాయి క్యాడర్ లో ఆ సమన్వయం ఉంటుందా? లేదా? అన్న అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఎందుకంటే కూటమి పొత్తులో భాగంగా సీట్ల సర్దుబాటుతో పాటు ఆశావహులు ఎక్కువగా ఉండటం, టిక్కెట్ దక్కని వాళ్లు నిరాశకు గురి కావడంతో నిన్నటి వరకూ కొంత శషభిషలు ఉండేవి. అయితే ఫలితాలను చూస్తుంటే మాత్రం కూటమి పార్టీల మధ్య సమన్వయం ఉన్నట్లు స్పష్టంగా కనిపించింది. అదే సమయంలో ఓట్ల బదిలీ కూడా ఖచ్చితంగానే జరిగిందని చెప్పాలి. ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార కూటమిలోని టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల మధ్య సీట్ల పంపకాలు, సమన్వయం మరియు ఓట్ల బదిలీ కీలక పాత్ర పోషించాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పట్టణ స్థానిక సంస్థల్లో కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటును అధికారికంగా ఖరారు చేశారు. అనేక దఫాలుగా సమావేశమై మేయర్, ఛైర్మన్ పదవుల పంపకం జరిగింది. తెలుగుదేశం పార్టీ ఎక్కువ స్థానాల్లో బరిలోకి దిగగా, జనసేన పార్టీ బీజేపీ లు మిగిలిన స్థానాల్లో బరిలోకి దిగాయి. కొన్ని చోట్ల ఏకగ్రీవమయ్యాయి. మరికొన్ని చోట్ల నామినేషన్ల సందర్భంగా స్క్రూటినీలో ప్రత్యర్థులకు చెందిన నామినేషన్ పత్రాలు తిరస్కరణకు గురి కావడంతో అక్కడ ఎన్నిక నామమాత్రమయింది. మరికొన్ని స్థానాల్లో వైసీపీ అభ్యర్థులు మధ్యలోనే బరిలో నుంచి పక్కకు తప్పుకున్నారు.మూడు పార్టీల మధ్య ఓట్ల చీలికను అరికట్టడానికి ముందస్తుగా సీట్ల పంపకాలు పూర్తి చేసుకుని వ్యూహాత్మకంగా అభ్యర్థులను నిలబెట్టాయి. కొన్ని ప్రాంతాల్లో మాత్రం స్థానిక నాయకుల మధ్య ఆశావహుల పోటీ వల్ల సమన్వయ లోపాలు తలెత్తినప్పటికీ, పెద్ద ఎత్తున ఓట్ల బదిలీ కూటమికి కలిసొచ్చింది. దీంతో పట్టణ స్థానిక సంస్థల ఓట్ల లెక్కింపులో కూటమి పార్టీలు ఇచ్చాపురం నుంచి కుప్పం వరకు స్పష్టమైన ఆధిక్యతను ప్రదర్శిస్తూ విజయపథంలో దూసుకెళ్లాయి. ఎక్కడా అభ్యర్థిని చూడకుండా పార్టీని చూసి ఓటు వేసినట్లు కనిపించింది. అందుకే ఎక్కువ శాతం కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధించారు. పార్టీ అధినేతలు కూడా రెబెల్స్ ను పోటీ నుంచి తప్పుకోవాలని, లేకుంటే పార్టీ నుంచి సస్పెండ్ చేస్తామని ప్రకటించడం కూడా కొంత కూటమికి కలసి వచ్చిందనే చెప్పాలి. మరో మూడేళ్లు రాష్ట్రంలో కూటమి అధికారంలో ఉంటుంది కాబట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమిని గెలుపెంచుకుని తమ ప్రాంత అభివృద్ధి కి చేయూత నివ్వాలని ప్రజలు భావించినట్లుంది.

ఏపీలో రాహుల్ ప్లాన్ ఏంటి



విజయవాడ : మొత్తం మీద కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఒక విషయంలో విజయం సాధించారు. ప్రధాని కాలేకపోయిన ఆయన విపక్షాలను ఏకతాటిపైకి తెచ్చి బలమైన ప్రతిపక్ష నాయకుడుగా మారారు. అది తాజాగా ఢిల్లీలోని రామ్ లీలా మైదానంలో కళ్ళకు కట్టినట్లుగా కనిపించింది. రాహుల్ నాయకత్వం మీద మొదట్లో సందేహాలు వ్యక్తం చేసిన పార్టీలు కూడా భుజం కలిపి నడిచాయి. అంతా కలసి ఐక్యతను చాటాయి. దాంతో రాహుల్ కేంద్ర బిందువుగా మారారు. ఇక ఉత్తరాదిలో యూపీ నుంచి సమాజ్ వాది పార్టీతో కాంగ్రెస్ కి దోస్తీ ఉంది. అలాగే బీహార్ లో ఆర్జేడీతో పొత్తు ఉంది. పశ్చిమ బెంగాల్ లో మమతా బెనర్జీ ఓటమి తరువాత కాంగ్రెస్ తో మరింత సాన్నిహిత్యం నెరపుతున్నారు. మహారాష్ట్రలో ఉద్ధవ్ ఠాక్రే శివసేన మరో వైపు ఎన్సీపీ శరద్ పవార్ పార్టీతో చెలిమి చేస్తూ బలంగానే ఉంది. గుజరాత్ రాజస్థాన్, మధ్యప్రదేశ్ ఢిల్లీ పంజాబ్ వంటి చోట్ల కాంగ్రెస్ బలంగానే ఉంటూ తన పోరాటం సొంతంగా సాగిస్తోంది.ఇక దక్షిణాదిన మొదటి నుంచి కాంగ్రెస్ బలంగానే ఉంది. కర్ణాటక తెలంగాణాలలో సొంతంగానే అధికారంలోకి వచ్చింది. కేరళలో ఇటీవల పవర్ ని అందుకుంది. తమిళనాడులో ఆరు దశాబ్దాల తరువాత ప్రభుత్వంలో చేరింది. రెండు మంత్రి పదవులు కూడా తీసుకుంది. సినీ దళపతి విజయ్ స్థాపించిన టీవీకేతో కొత్త స్నేహం నెరిపి దక్షిణాదిన అయిదింట నాలుగు రాష్ట్రాలలో తన హవాను స్పష్టం చేస్తోంది. అన్నీ బాగానే ఉన్నా మొదటి నుంచి కాంగ్రెస్ కి పెట్టని కోటగా ఉన్న ఏపీని ఎందుకు వదిలేస్తోంది అన్నదే చర్చగా ఉంది. దేశంలో ఓట్ల చోరీ అంటూ కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ ఉద్యమిస్తున్నారు. మరి ఏపీలో కూడా ఈ ఉద్యమాన్ని ఎత్తుకుని అక్కడ విపక్ష భూమికను బలంగా ముందుకు తీసుకుని వెళ్ళే చాన్స్ ని ఎందుకు వదిలేస్తున్నారు అన్న చర్చ సాగుతోంది. ఇక స్థానిక సంస్థలకు ఎన్నికలు ప్రస్తుతం ఏపీలో జరుగుతున్నాయి. అన్ని పార్టీలు తమ శక్తి మేరకు బరిలో నిలబడి తలపడుతున్నాయి. ఇండిపెండెంట్లు కూడా అనేక చోట్ల జాతకాన్ని పరీక్షించుకుంటున్నాయి. అలాంటిది కాంగ్రెస్ అయితే ఎందుకో ఇంతటి సువర్ణ అవకాశాన్ని వదిలేసుకుంటోందా అన్న చర్చ సాగుతోంది. కాంగ్రెస్ కి గత మూడు ఎన్నికలూ దెబ్బేశాయి. డిపాజిట్లు గల్లంతు అయ్యాయి. కానీ కాలం ఎపుడూ ఒకేలా ఉండదు అంటారు. అలాంటిది ఏపీలో అధికార కూటమి విపక్ష వైసీపీలకే రాజకీయ మైదానం వదిలేసి కాంగ్రెస్ ఇంకా వేచి చూసే ధోరణిలో ఉందా అన్నదే అంతా ఆలోచిస్తున్నారు. వామపక్షాలను ఇతర పాటీలని కలుపుకుని ఫ్రంట్ గా కట్టి ముందుకు సాగితే స్థానిక ఎన్నికల్లో ఎన్నో కొన్ని సీట్లు అయినా దక్కుతాయని కదా అని అంటున్నారు. ఒక వేళ అలా కాకపోయినా కాంగ్రెస్ తన రాజకీయ ఉనికిని చాటుకునే విధంగా ఉండేది కదా అని కూడా అంటున్నారు. అయితే ఏపీ మీద మాత్రం కాంగ్రెస్ కి సరైన ప్లాన్స్ ఉన్నాయా లేవా అన్నదే ఇపుడు అంతా చర్చించుకుంటున్నారు. ఏపీలో ఎన్డీయే బలంగా ఉంది. విపక్షంలో వైసీపీ ఉంది. జగన్ ని కలుపుకుంటే: దాంతో కాంగ్రెస్ ఇక్కడ తన రాజకీయ విస్తరణకు కొత్త ఆలోచనలు చేయాల్సి ఉంది. దక్షిణాదిన అంతటా తన హవా ఉన్న కాంగ్రెస్ కి ఏపీలో ఆ పలుకుబడిని ఉపయోగించి ఎంతో కొంత ఎదగడం కష్టం కాదని అంటున్నారు. కానీ ఆ దిశగా ప్రయత్నాలు జరగకపోవడమే ఆశ్చర్యంగా ఉందని అంటున్నారు. ఏపీలో జగన్ ని కలుపుకుంటే ఇండియా కూటమికి దక్షిణాదిన మరింత బలం వస్తుందని అంటున్నారు. అయితే జగన్ వద్దు అన్నదే కాంగ్రెస్ ఆలోచనగా ఉందా అని కూడా ప్రశ్నలు వస్తున్నాయి. దాంతో ఏపీలో కాంగ్రెస్ ని బలోపేతం చేయడం కోసం రాహుల్ ప్లాన్ ఏంటి అన్నది అర్థం కావడం లేదని అంటున్నారు.

మెహిదీపట్నం హోటల్లో అగ్నిప్రమాదం



హైదరాబాద్ మెహిదీపట్నం కింగ్స్ రెస్టారెంట్లో రాత్రి 11:40 గంటలకు అగ్నిప్రమాదం జరిగింది. నూడుల్స్ తయారుచేసే ప్రాంతంలో మంటలు చెలరేగాయి. సమాచారం అందిన వెంటనే రంగంలోకి దిగిన ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేసారు. లంగర్ హౌస్, అంబర్‌పేట నుంచి ఘటనా స్థలానికి ఫైర్ ఇంజన్లు చేరుకున్నాయి. ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. అగ్నిప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. అయితే. ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించకపోవడంతో ఘటన జరిగిందని అధికారులు అనుమానిస్తున్నారు.

నేను శపిస్తే ఎవరూ ఆ శాపం నుంచి తప్పించుకోలేరు

- కేఏ పాల్, ప్రజాశాంతి పార్టీ



హైదరాబాద్ అమెరికా మిడ్ టర్మ్ ఎన్నికల్లో ట్రంప్ ఓటమితో ప్రపంచానికి మేలు జరుగుతుంది. యుద్ధ పిపాసులుగా ఉండే నేతలకు ఓటమే ఎదురవుతుందని ప్రజాశాంతి పార్టీ అధినేత కెఏ పాల్ అన్నారు. ఇజ్రాయెల్లో నెతన్యాహూ పరిస్థితి కూడా ఇలాగే ఉంది. ఇరాన్ యుద్ధం ఆపకపోతే మాజీ స్పీకర్గా మారతావు అంటూ స్పీకర్ మైక్ జాన్సన్ను హెచ్చరించాను. కళ్లు నెత్తికెక్కిన రాజకీయ నేతలు ఎవరికైనా ఇదే పరిస్థితి ఎదురవుతుందని అన్నారు. నేటి ప్రపంచంలో ట్రంప్ కంటే పవర్ఫుల్ నేత ఎవరూ లేరు. ఎన్ని బెదిరింపు కాల్స్ వచ్చినా నేను ట్రంప్ తీరును వ్యతిరేకిస్తూ వచ్చాను. ఇది మన దేశంలో ముఖ్యమంత్రులు, నేతలకు కూడా హెచ్చరికే. మతం పేరుతో గొడవలు పెట్టేవారికి ఇదే నా హెచ్చరిక. బైబిల్ పంచినందుకు మహిళలపై దాడి చేస్తే.. వారిని ఇప్పటికీ అరెస్ట్ చేయలేదు. నేను భారత్ కి తిరిగి వస్తా ఒక్కొక్కరి తాట తీస్తా. నేను శపిస్తే ఎవరూ ఆ శాపం నుంచి తప్పించుకోలేరని హెచ్చరించారు.

పదవి కోసం హడావిడిగా పెళ్లి... ప్లాన్ అదిరింది..

సాలూరు సాలూరు మున్సిపల్ చైర్ పర్సన్ స్థానం కోసం టీడీపీ యువ నేత కేవలం 24 గంటల్లోనే పెళ్లి చేసుకున్నారు. కానీ ఫలితం మాత్రం దిమ్మ తిరిగేలా వచ్చింది. నిజానికి ఆ స్థానాన్ని బీసీ మహిళకు కేటాయించడంతో.. ఆ పదవిని ఎలాగైనా దక్కించుకోవాలని తెలుగు దేశం పార్టీ నాయకుడు హర్షవర్ధన్ లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో భాగంగా తన ప్రియురాలు మంజీరను ఎవరినీ పిలవకుండా గుడిలో అత్యంత హడావిడిగా వివాహం చేసుకున్నారు. ఆమెను మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థిగా పోటీ చేయించి గెలిపించుకోవాలనే లక్ష్యంతో ఆయన ఈ పెళ్లి చేసుకున్నారు.తీరా కళ్యాణం అయ్యాక.. ఒక ట్విస్ట్ ఎదురైంది. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి సీట్ల పంపకాల్లో భాగంగా సాలూరు మున్సిపల్ చైర్‌పర్సన్ స్థానం అనూహ్యంగా జనసేన పార్టీకి దక్కింది. దీంతో పార్టీ నుంచి తన భార్యకు టికెట్ దక్కలేదు. అయినా హర్షవర్ధన్ వెనక్కి తగ్గలేదు. భార్య మంజీరను ఇండిపెండెంట్ అభ్యర్థిగా బరిలోకి దించి ఎన్నికల ప్రచారం చేశారు. అయితే ఎన్నికల ఫలితాల్లో ఆమె ఓటమిపాలయ్యారు. కానీ ఈ ఎన్నికల్లో 21వ వార్డు కౌన్సిలర్‌గా హర్ష వర్ధన్ విజయం సాధించారు. కానీ చైర్‌పర్సన్ రేసులో భార్య ఓడిపోవడంతో ఆయనకు తీవ్ర నిరాశ మిగిలింది.బలమైన పొలిటికల్ బ్యాక్‌గ్రౌండ్...స్థానికంగా హర్షవర్ధన్‌కు బలమైన రాజకీయ నేపథ్యం ఉంది. ఆయన 2019లో సాలూరులో టీడీపీ కౌన్సిలర్‌గా కూడా గెలిచారు. అలాగే మంత్రి గుమ్మిడి సంధ్యారాణికి విధేయుడిగా ఆయనకు మంచి గుర్తింపు, గౌరవం ఉన్నాయి. స్థానికంగా మంచి గౌరవ మర్యాదలున్నాయి. ఆయన తండ్రి వైకుంఠపు పంచముఖి కూడా గతంలో కౌన్సిలర్‌గా పనిచేశారు. దీంతో హర్షవర్ధన్ తమ కుటుంబానికి సాలూరు మున్సిపల్ పీఠం దక్కుతుందనే బలంగా అంచనా వేసుకున్నారు. దానికోసం పట్టుదలగా ప్రయత్నించారు. కానీ ఊహించని క్లైమాక్స్ ఎదురైంది. అయితే కేవలం మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి కోసమే హడావిడిగా పెళ్లి చేసుకుని, ఆ స్థానం వేరే పార్టీకి వెళ్లడంతో పాటు పోటీలో కూడా ఓడిపోవడం స్థానికంగా పెద్ద చర్చనీయాంశంగా మారింది.

అఫిషీయల్.. రజనీకాంత్ 'ధర్మన్'లో శ్రీలీల!

సూపర్‌స్టార్ రజనీకాంత్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'ధర్మన్'. యువ దర్శకుడు అశ్వత్ మారిముత్తు ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా లెజెండరీ నటుడు కమల్ హాసన్‌కు చెందిన 'రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్' మరియు 'టర్మరిక్ మీడియా' బ్యానర్లు సంయుక్తంగా ఈ భారీ బడ్జెట్ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. కొద్దికాలంగా సోషల్ మీడియాలోనూ, సినీ వర్గాలలోనూ శ్రీలీల ఈ చిత్రంలో నటిస్తారనే వార్తలు జోరుగా ప్రచారంలో ఉన్నాయి. తాజాగా మేకర్స్ ఈ ఊహాగానాలన్నింటికీ తెరదించుతూ అధికారిక ప్రకటన విడుదల చేశారు. సోషల్ మీడియా వేదికగా ఓ ప్రత్యేక వీడియోను పంచుకుంటూ.. టాలెంటెడ్ నటి శ్రీలీల 'ధర్మన్' చిత్రంలో భాగం కాబోతున్నట్లు స్పష్టం చేశారు. ఈ చిత్రంలో రజనీకాంత్ ఇప్పటివరకు చూడని విభిన్నమైన పాత్రలో వైద్యుడిగా (డాక్టర్) కనిపించనున్నట్లు తెలుస్తోంది. కేవలం రజనీకాంత్ మాత్రమే కాకుండా, ఈ సినిమాలో ఎంపిక చేసిన తారాగణం కూడా చాలా ప్రత్యేకంగా ఉంది. రామ్ పోతినేని, గ్లామరస్ నటి సిమ్రాన్, రాశీఖన్నా, స్టార్ హీరోయిన్ నయనతార, కమెడియన్ యోగిబాబు తదితరులు ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇంతమంది స్టార్స్ ఒకే సినిమాలో నటిస్తుండటంతో సినిమాపై అంచనాలు తారాస్థాయికి చేరాయి.

కిరణ్ అబ్బవరం 'హతః'
విడుదల వాయిదా..
- కొత్త రిలీజ్ డేట్ ఎప్పుడంటే?



టాలీవుడ్ యువ హీరో కిరణ్ అబ్బవరం నిర్మాతగా వ్యవహరిస్తున్న రెండో చిత్రం 'హతః' విడుదల వాయిదా పడింది. అనుష్ గోరక్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఇప్పటికే మంచి అంచనాలున్నాయి. అయితే, బాక్సాఫీస్ వద్ద ఇతర సినిమాల పోటీ ఎక్కువగా ఉండటం, ప్రేక్షకులకు థియేటర్లలో సరికొత్త, అత్యుత్తమ సౌండ్ అండ్ విజువల్ అనుభూతిని అందించాలనే ఉద్దేశంతో మేకర్స్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ చిత్రంలో కుష్ము మద్దాల, రెహ్మాన్, నమ్రిత ఎంవి, తనూజ పుట్టస్వామి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. విభిన్నమైన కథాంశంతో రూపొందుతున్న ఈ సినిమాకు సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ పనులు ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే సరికొత్త విడుదల తేదీని ప్రకటిస్తామని చిత్ర బృందం స్పష్టం చేసింది.

ఆ తరహా పాత్రలు చేసే సత్తా మాలో ఉంది



స్త్రీవాదాన్ని బలంగా వినిపించే బాలీవుడ్ కథానాయికల్లో కృతి సనన్ ముందు వరుసలో ఉంటుంది. సినీ పరిశ్రమలో స్త్రీలపై వివక్ష అనే అంశంపై ఆమె పలుమార్లు స్పందించారు కూడా. తాజాగా ప్రేక్షకులను థియేటర్లకు తెచ్చే సత్తా హీరోయిన్లకు కూడా ఉందని, కేవలం అగ్ర హీరోలతో మాత్రమే అధిక బడ్జెట్‌లు పెట్టి సినిమాలు తీసే సంస్కృతి నుంచి మేకర్స్ బయటకు రావాలని కృతి సనన్ అన్నారు. ఇటీవల ఓ ప్రైవేటు వేడుకలో ఆమె మాట్లాడుతూ 'పఠాన్, ధురంధర్ లాంటి భారీ బడ్జెట్ యాక్షన్ సినిమాలను మహిళా ప్రధాన పాత్రలతో తెరకెక్కి ంచినా జనం ఆదరిస్తారు. అలాంటి పాత్రల్ని చేయడానికి మేం సిద్ధంగా ఉన్నాం. తీయడానికి నిర్మాతలకు ధైర్యం ఉందా?' అని కృతి సనన్ ప్రశ్నించారు. నిర్మాతలు ధైర్యం చేసి, తమ లాంటి హీరోయిన్లతో భారీ కమర్షియల్ సినిమాలు నిర్మించగలిగితే.. వాటిని తమ భుజస్కంధాలపై విజయవంతంగా మోయగలిగే శక్తి తమకుందని కృతి సనన్ చెప్పారు. కృతి సనన్ మాటలు ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశమయ్యాయి.

అలా నమితను కాస్తా మమితనయ్యా




'ప్రేమలు' సినిమా మమితాబైజు తలరాతను మార్చింది. ఆ సినిమాలోని ఆమె నటన, క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్ యువతను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆ ఒక్కసినిమాతోనే దక్షిణభారతం మొత్తం మమితకు ఫ్యాన్ బేస్ ఏర్పడింది. ఆ తర్వాత వచ్చిన డ్యూడ్, జననాయగన్, విశ్వనాథ్ అండ్ సన్స్ సినిమాలు ఆమెను ప్రేక్షకులకు మరింత చేరువ చేశాయి. ప్రస్తుతం తమిళంలో 'ఇరందు వానమ్', మలయాళంలో 'హలో డియర్' సినిమాలు చేస్తూ మమిత బిజీగా ఉన్నది. ఇదిలావుంటే.. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన పేరుకు సంబంధించిన ఓ రహస్యాన్ని బయటపెట్టింది మమితా బైజు. నిజానికి ఆమె పుట్టగానే తల్లిదండ్రులు పెట్టిన పేరు నమిత. అయితే.. బర్త్ సర్టిఫికెట్ నమోదు చేసే క్రమంలో అధికారుల పొరపాటు కారణంగా 'నమిత' అనే పేరు కాస్తా.. 'మమిత'గా మారిపో యిందట. ఈ విషయంపై ఆమె మాట్లాడుతూ 'ఈ విషయం అమ్మానాన్నలకు కూడా వెంటనే తెలియలేదు. నాలుగేళ్ల వయసులో నన్ను స్కూల్‌లో చేర్పించడానికి నా బర్త్ సర్టిఫికెట్‌ని పరిశీలించగా ఈ తప్పు బయటపడింది. అప్పటికే అఫీషియల్ డాక్యుమెంట్స్ అన్నింటిలో మమితా అనే పేరే నమోదైపోవడంతో దాన్ని మార్చడం సాధ్యం కాలేదు. అలా నమితను కాస్తా మమితను అయ్యాను' అంటూ చెప్పుకొచ్చింది మమితాబైజు.

నవ్వులు పంచే 'పాకెట్ రాకెట్స్'



నిహారిక కొణిదెల పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్, మాక్సిమం సిటీ స్టూడియోస్ కలిసి నిర్మిస్తున్న చిత్రం 'పాకెట్ రాకెట్స్'. రుద్ర ఆత్రి దర్శకత్వం వహిస్తున్న చిత్రానికి పద్మజ కొణిదెల, రాహుల్ రాఘవేంద్ర, రాహుల్ నిమ్మకూరి నిర్మాతలు. 'కమిటీకుర్రోళ్లు'ఫేం త్రినాథ్‌వర్మ, నిర్మల్, శ్రియా కొంతం ప్రధాన పాత్రధారులు. గ్యాంబ్లింగ్ చుట్టూ తిరిగే ఈ విభిన్న కథాచిత్రంలో జేడీ చక్రవర్తి కీలక పాత్రధారి. మంగళవారం హైదరాబాద్‌లో ఈ సినిమా టీజర్‌ని మేకర్స్ విడుదల చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన ప్రెస్‌మీట్‌లో నిహారిక కొణిదెల మాట్లాడుతూ 'జూలైలో సినిమా షూటింగ్ మొదలుపెట్టాం. ఆరునెలల్లో పూర్తి చేసి విడుదల చేస్తున్నాం. డిసెంబర్ 11న సినిమా థియేటర్లలోకి రానున్నది. ఇక రిలీజ్ వరకూ మేమంతా మీ సోషల్ మీడియాలోకి, ఇంట్లోకి వచ్చేస్తాం' అని తెలిపింది. నిహారిక లాంటి గ్రేట్ ప్రొడ్యూసర్‌ని తాను ఇంతవరకూ చూడలేదని, రుద్ర ఈ సినిమాను ఎంత గొప్పగా తీశారో రేపు థియేటర్లలో చూస్తారని జేడీ చక్రవర్తి అన్నారు. టీమ్ ఇచ్చిన సహకారం వల్లే సినిమాను వేగంగా పూర్తి చేయగలిగానని దర్శకుడు రుద్ర అత్రి చెప్పారు. రెండు గంటల సేపు హాయిగా నవ్వించే సినిమా ఇదని నిర్మాత రాహుల్ రాఘవేంద్ర పేర్కొన్నారు. ఇంకా చిత్రబృందమంతా మాట్లాడారు. ఈ చిత్రానికి

గాయపడ్డ వ్యక్తి జీవిత కథ



అగ్ర కథానాయకుడు దేవరకొండ విజయ్ హీరోగా రూపొందుతున్న యాక్షన్ డ్రామా 'రౌడీ జనార్దన'. గోదావరి తీరంలోని కళింగపట్టణం గ్రామ నేపథ్యంలో సాగే ఈ రస్టిక్ యాక్షన్ థ్రిల్లర్‌కి రవికిరణ్ కోలా దర్శకుడు. దిల్‌రాజు నిర్మాత. నిర్మాణం తుదిదశకు చేరుకున్న ఈచిత్రం డిసెంబర్‌లో విడుదల కానున్నది. రెండు భాగాలుగా సినిమాను విడుదల చేయాలనే ఆలోచనలో మేకర్లు ఉన్నట్లు వార్తలు కూడా వస్తున్నాయి. ఇటీవలే మంగళూరులో ఈ సినిమాకు సంబంధించిన కీలక సన్నివేశాలను పూర్తిచేశారు. ప్రస్తుతం హైదరాబాద్ అల్యూమినియం ఫ్యాక్టరీలో ఈసినిమా కోసం ఓ భారీసెట్‌ని నిర్మిస్తున్నారు. ఈ సెట్‌లో ద్వితీయార్ధంలో వచ్చే ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్‌ని షూట్ చేస్తారట. ఇది ఓ గాయపడ్డ వ్యక్తి జీవిత చరిత్ర అని, ధైర్యసాహసాలతో, తెగింపుతో ఓ సామ్రాజ్యాన్ని నిర్మించుకున్న జనార్దన అనే రౌడీ కథను ఈ సినిమాలో చూపించనున్నారని, అధికార పోరాటాల చుట్టూ నడిచే కథ ఇదని మేకర్స్ తెలిపారు. సీనియర్ హీరో రాజశేఖర్ ఇందులో కీలక పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. ఆయన పాత్ర, లుక్ మునుపెన్నడూ చూడని రీతిలో ఉంటుందట. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ రూటెడ్ యాక్షన్ డ్రామాలో విజయ్‌కు జోడీగా కీర్తి సురేశ్ నటిస్తున్నది.

ఇది 'ఈ నగరానికి ఏమైంది'కి ఎపిక్ వెర్షన్



'నాజీవితం ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నా, ఓ నలుగురు స్నేహితులు నన్ను అంటిపెట్టుకుని ఉండేవారు. 'పెళ్లి చూపులు' తర్వాత నేను ఫ్రెండ్‌షిప్ నేపథ్యంలో 'ఈ నగరానికి ఏమైంది' సినిమా చేయడానికి ప్రేరణ వాళ్లే. ఇప్పుడు ఆ సినిమాకు సీక్వెల్‌గా చేశాను. ఈ సినిమాపై అంచనాలు బలంగా ఉంటాయని నాకు తెలుసు. అందుకే 'ఈ నగరానికి ఏమైంది' సినిమాకు ఓ ఎపిక్ వెర్షన్‌లా ఉండేలా ఈ ట్రైలర్‌ను కట్ చేశాం. సినిమా కూడా అలాగే ఉంటుంది. పాజిటీవ్ ఎనర్జీతో చేసిన సినిమా ఇది. సక్సెస్‌పై నమ్మకంతో ఉన్నాం. ఫ్యామిలీస్‌తో ఎంజాయ్ చేసేలా సినిమా ఉంటుంది' అని డైరెక్టర్ తరుణ్‌భాస్కర్ అన్నారు. ఆయన దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'జుచీజు =వజూమ్ఫ్'. విశ్వక్‌సేన్, అభినవ్ గోమఠం, వెంకటేశ్ కాకుమాను, శ్రీనాథ్ మాగంటి మరోసారి కలిసి నటించిన ఈ చిత్రానికి సృజన్ యరబోలు, సందీప్ నాగిరెడ్డి నిర్మాతలు. ఈ నెల 19న సినిమా విడుదల కానున్నది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో తరుణ్‌భాస్కర్ మాట్లాడారు. ట్రైలర్ అద్భుతంగా అనిపించిందని, తరుణ్‌భాస్కర్ ప్రాణంపెట్టి సినిమా చేశారని, నవ్వించే, ఆనందంతో ఏడిపించే అంశాలు ఈ సినిమాలో చాలా ఉంటాయని హీరో విశ్వక్‌సేన్ చెప్పారు. ఇంకా అభినవ్ గోమఠం, వెంకటేశ్ కాకుమాను, అనిషా, శివాత్మిక, నిర్మాత సృజన్ కూడా మాట్లాడారు. గందరగోళం, ఉత్సాహాలతో నిండిన ఒక వినోదాత్మక ప్రయాణాన్ని ఈ సినిమా అందించబోతున్నదని ట్రైలర్ చెబుతున్నది.

ఇందిరమ్మ ఇంట్లో దీపావళి వేడుకలు

లబ్ధిదారులు ,అధికారులు,, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని పిలుపు

రాష్ట్రంలో 2,21,500 ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు పూర్తి

వివిధ నిర్మాణ దశల్లో 1.90 లక్షల ఇందిరమ్మ ఇళ్లు

4 కార్పొరేషన్లలో హైదరాబాద్ తరహా ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం

రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



మేడ్చల్(ప్రశ్న న్యూస్)రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిరుపేదల కోసం నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఇంతవరకు 2,21,500 ఇళ్లలో గృహప్రవేశాలు పూర్తయ్యాయని ఈ దీపావళి రోజున ప్రతి ఇందిరమ్మ ఇంటిలో దీపావళి వేడుకల జరపాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. ఆరోజున పేదల ఇంట్లో వెలిగే ప్రతిదీపం తెలంగాణ ప్రజాప్రభుత్వ సంకల్పానికి ప్రతీక కావాలన్నారు..బుధవారం నాడు మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రంగారెడ్డి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి మంత్రి పొంగులేటి మాట్లాడారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో ఈ ప్రజా ప్రభుత్వం ఎన్ని ఆర్థిక అవరోధాలున్నా పేదల ఆత్మగౌరవానికి చిహ్నమైన ఇందిరమ్మ ఇళ్లను నిర్మించేందుకు నిర్ణయించిందన్నారు. భద్రత, భరోసాతో పాటు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలన్న సంకల్పంతో తొలివిడత 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయగా ఇప్పటికి 2,21,500 ఇళ్లలో గృహ ప్రవేశాలు పూర్తయ్యాయని, మరో 1.90 లక్షల ఇళ్ళు వివిధ నిర్మాణదశల్లో పూర్తికానున్నాయని మంత్రి పొంగులేటి తెలిపారు. గృహ ప్రవేశాలు జరుపుకున్న ఇళ్లకు దీపావళి రోజున ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, గృహ నిర్మాణ శాఖ అధికారులు, ఇందిరమ్మ ఇళ్ళ కమిటీ సభ్యులు, ఈ పథకంతో మమేకమైన అందరూ ఆ ఇళ్లకు వెళ్లి వారి ఆనందాల్లో భాగస్వాములు కావాలని కోరారు. దీనికి సూచికగా

మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి వేడుకలు

అనే పోస్టర్‌ను మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి మంత్రి పొంగులేటి ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సహా రాష్ట్ర మంత్రి వర్గం ఈ కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించాలని కోరుతోందని మంత్రి పొంగులేటి వెల్లడించారు. అనంతరం మంత్రి పొంగులేటి మాట్లాడుతూ తొలి విడతగా 4.50 లక్షల ఇళ్లు, రెండో విడత 2.50 లక్షల ఇళ్లతో పాటు హైదరాబాద్ క్యూర్ ఏరియా పరిధిలో లక్ష ఇళ్లను మంజూరు చేశామని చెబుతూ హైదరాబాద్ తరహాలోనే రాష్ట్రంలోని నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, నల్గొండ కార్పొరేషన్‌లలో కూడా ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం చేపడతామని ప్రకటించారు. జి+5 పద్ధతిలో నిర్మించనున్న ఈ టవర్స్ నిర్మాణానికి సంబంధించి దీపావళి లోగా నోటిఫికేషన్ జారీ చేస్తామని తెలిపారు. హైదరాబాద్‌లో నిర్మిస్తున్న ఇందిరమ్మ టవర్స్ నుంచి వచ్చే ఏడాది బోనాలు ఎత్తిస్తామని మంత్రి గారు పునరుద్ఘాటించారు. రాష్ట్రంలో రూ.40 వేల కోట్లతో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ ఆపేదిలేదని స్పష్టం చేస్తూ ఇప్పటికే ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు ప్రతి సోమవారం నేరుగా హైదరాబాద్ నుంచి అవినీతి రహితంగా నిధులను జమచేస్తున్నామని వివరించారు. రాష్ట్రంలోని నగరాలు, పట్టణాలు, గ్రామాలేగాక మారుమూల ప్రాంతాలు, తండాలలో కూడా ఈ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరుగుతోందని ఫలితంగా పేదవారి సొంతింటికల సాకారమవుతోందని మంత్రి పొంగులేటి అన్నారు.

మంథనిలో మార్పు కోరుకుంటున్నారా ప్రజలు?

అందుబాటులో లేని నాయకత్వంపై అసహనమా? ప్రత్యామ్నాయాల వైపు ప్రజల చూపు!

మంథని రాజకీయాల్లో కొత్త చర్చ..

పునర్విభజన జరిగితే మారనున్న సమీకరణాలు.

ప్రజల నాడి ఎటువైపు?





మంథని(, ప్రశ్న న్యూస్) మంథని నియోజకవర్గంలో రాజకీయ చర్చలు కొత్త మలుపు తిరుగుతున్నాయా? స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నాయకత్వంపై ప్రజల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయా? అభివృద్ధి పనులు జరుగుతున్నప్పటికీ, సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వం కావాలనే అభిప్రాయం కొందరిలో వ్యక్తమవుతోందా? అనే ప్రశ్నలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారుతున్నాయి.మంత్రి శ్రీధర్ బాబు నియోజకవర్గ అభివృద్ధికి నిధులు తీసుకొస్తూ పలు కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ, ప్రజలకు నేరుగా అందుబాటులో ఉండే విషయంలో మరింత చొరవ చూపాలనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. అయితే, ఇవి ప్రజలందరి అభిప్రాయాలా? లేక కొందరి అసంతృప్తి మాత్రమేనా? అనేది క్షేత్రస్థాయిలో స్పష్టత రావాల్సి ఉంది.అభివృద్ధి ఒకవైపు.. అందుబాటు మరోవైపు!మంథని నియోజకవర్గంలో అభివృద్ధి పనులపై ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. ఇటీవల రూ.164 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు వార్తలు వెలువడ్డాయి. అయితే, ప్రజాస్వామ్యంలో అభివృద్ధి పనులు మాత్రమే నాయకుడి విజయానికి కొలమానం కావు. ప్రజల సమస్యలను వినడం, కార్యకర్తలకు సమయం కేటాయించడం, సామాన్యులకు అందుబాటులో ఉండటం, సమస్యల పరిష్కారానికి స్పందించడం కూడా నాయకత్వానికి కీలకమైన అంశాలుగా మారుతున్నాయి.ప్రజలు తమ సమస్యలతో నాయకుడి వద్దకు వెళ్లలేకపోతున్నామనే భావనకు గురైతే, అది క్రమంగా అసంతృప్తికి దారితీసే అవకాశం ఉందనే రాజకీయ విశ్లేషణలు వినిపిస్తున్నాయి.పునర్విభజన జరిగితే.. రాజకీయ బరిలో కొత్త ముఖాలా? నియోజకవర్గాల పునర్విభజన జరిగితే మంథని రాజకీయ సమీకరణాలు మారే అవకాశం ఉందనే చర్చ నేపథ్యంలో, వివిధ పార్టీల నుంచి పోటీ చేసే అవకాశం ఉన్న నాయకుల పేర్లు తెరపైకి వస్తున్నాయి.

కాంగ్రెస్ పార్టీ నుంచి చర్చలో ఉన్న పేర్లు:

- దుద్దిళ్ల శ్రీధర్ బాబు
- శీను బాబు
- తొట్ల తిరుపతి యాదవ్
- ఇనుముల సతీష్
- శశి భూషణ్ కాచే
- శ్రీరాశీబట్ల శ్రీనివాస్
- ఓడ్నాల శ్రీనివాస్
- చొప్పరి సదానందం

బీఆర్ఎస్ పార్టీ నుంచి చర్చలో ఉన్న పేర్లు:

- పుట్ట మధుకర్
- పుట్ట శైలజ
- పూదరి సత్యనారాయణ గౌడ్
- కనవేన శ్రీనివాస్

బీజేపీ పార్టీ నుంచి చర్చలో ఉన్న పేర్లు:

- చందుపట్ల సునీల్ రెడ్డి
- చల్లా నారాయణరెడ్డి

ఇవి ప్రస్తుతం రాజకీయ చర్చల్లో వినిపిస్తున్న పేర్లు మాత్రమే. పునర్విభజన, పార్టీ నిర్ణయాలు, అధికారిక అభ్యర్థుల ఎంపికపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. నాయకుడు నచ్చకపోతే ప్రజలేం చేస్తారు?గత ఎన్నికల రాజకీయాలను పరిశీలిస్తే, మంథని ఓటర్లు తమ నిర్ణయాన్ని మార్చుకున్న సందర్భాలు ఉన్నాయి. 2014లో పుట్ట మధుకర్ విజయం సాధించగా, 2018లో దుద్దిళ్ల శ్రీధర్ బాబు తిరిగి గెలుపొందారు. 2023 ఎన్నికల్లోనూ శ్రీధర్ బాబు విజయం సాధించారు.ఈ పరిణామాలు ప్రజల తీర్పు శాశ్వతంగా ఒకే నాయకుడికి పరిమితం కాదని సూచిస్తున్నాయి.
ప్రజల నమ్మకాన్ని కోల్పోయిన నాయకుడికి ఎన్నికల సమయంలో ఓటర్లు ప్రత్యామ్నాయాన్ని ఎంచుకునే అవకాశం ఉంటుంది. ప్రజల సమస్యలను పట్టించుకోకపోవడం, అందుబాటులో లేకపోవడం, ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం వంటి



అంశాలు ఓటర్ల నిర్ణయంపై ప్రభావం చూపవచ్చు.

ప్రజల చూపు ఎటువైపు?

మంథని రాజకీయాల్లో ప్రస్తుతం ప్రధానంగా మూడు ప్రశ్నలు చర్చకు వస్తున్నాయి.
- అభివృద్ధి పనులు కొనసాగుతున్నప్పటికీ ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వం కావాలనే అభిప్రాయం బలపడుతోందా?
- కాంగ్రెస్ పార్టీలోనే ప్రత్యామ్నాయ నాయకత్వం కోసం కొందరు చూస్తున్నారా?
- బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ప్రజల్లో తమ బలాన్ని పెంచుకొని రాజకీయ మార్పుకు అవకాశం కల్పించగలరా?
ఈ ప్రశ్నలకు సమాధానం ప్రజల స్పందన, స్థానిక సమస్యలు, రాజకీయ పార్టీల కార్యాచరణపై ఆధారపడి ఉంటుంది.

ప్రజల తీర్పే అంతిమం!

మంథని ప్రజలు మార్పు కోరుకుంటున్నారా? లేక ప్రస్తుత నాయకత్వానికే మరోసారి అవకాశం ఇవ్వాలనుకుంటున్నారా? అనేది ఇప్పుడే నిర్ణయించడం తొందరపాటు అవుతుంది.
అయితే, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలంటే నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండటం, వారి సమస్యలను వినడం, పరిష్కారానికి చొరవ చూపడం అత్యంత అవసరం.అభివృద్ధి పనులు నాయకుడి బాధ్యత.. ప్రజలకు అందుబాటులో ఉండటం నాయకత్వ లక్షణం.. నమ్మకాన్ని నిలబెట్టుకోవడం రాజకీయ విజయం!మంథని ప్రజల మనసులో ఏముంది? మార్పు వైపా.. కొనసాగింపు వైపా? రాబోయే రాజకీయ పరిణామాలే సమాధానం చెప్పనున్నాయి.

బిజెపి సీనియర్ నాయకులు స్వర్గీయ డీ.వీ.కిషన్ రావు ప్రథమ వర్ధంతి

నివాళులు అర్పించిన తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు రామచందర్ రావు



మేడ్చల్(ప్రశ్న న్యూస్)మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలో బిజెపి సీనియర్ నాయకులు డీ.వీ.కిషన్ రావు ప్రథమ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు పాల్గొని ఆయన చిత్రపటానికి పూల మాల వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా డీ.వీ.కిషన్ రావు పార్టీకి సేవలను గుర్తు చేసుకుంటూ వారు లేని లోటు పార్టీలో కనిపిస్తుందని వారి కుటుంబ సభ్యులు డీ.వీ.మోహన్ రావు కు తెలిపారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ రూరల్ జిల్లా బిజెపి అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్, కామారెడ్డి జిల్లా ఇంచార్జి పట్లోల్ల విక్రమ్ రెడ్డి, బిజెపి రాష్ట్ర నాయకులు పాతూరి సుధాకర్ రెడ్డి, కోశాధికారి లవంగ శ్రీకాంత్, ఉపాధ్యక్షులు గౌరారం జగన్ గౌడ్, కార్యవర్గ సభ్యులు సర్వేశ్వర రెడ్డి, మేడ్చల్ మున్సిపాలిటీ బిజెపి ప్రధాన కార్యదర్శి కానుకంటి వంశీ విజయ్ వంజరి,జకట ప్రేమ దాసు, సీనియర్ నాయకులు లక్ష్మారెడ్డి, సాయినాథ్ రెడ్డి, రామన్నగారి శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షులు మైసరి రాజు వంజరి ,రామచంద్ర రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐఎంఏ వరంగల్ అధ్యక్షుడిగా డాక్టర్ తుంగతుర్తి సనత్ కుమార్ గంగపుత్ర ఎన్నిక

ఘనంగా సన్మానించిన టీజీఎస్ రాష్ట్ర కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర



హనుమకొండ(ప్రశ్న న్యూస్) ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) వరంగల్ అధ్యక్షుడిగా డాక్టర్ తుంగతుర్తి సనత్ కుమార్ గంగపుత్ర ఎన్నికైన సందర్భంగా తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా రాజేష్ ఖన్నా గంగపుత్ర మాట్లాడుతూ ఐఎంఏ వరంగల్ అధ్యక్షుడిగా ఎన్నికైన డాక్టర్ తుంగతుర్తి సనత్ కుమార్ గంగపుత్రకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు గంగపుత్ర సామాజిక వర్గానికి చెందిన వయోవృద్ధులకు ఉచిత వైద్య సేవలు అందించేలా కృషి చేయాలని ఆర్థిక ఇబ్బందులతో వైద్య విద్యను అభ్యసించలేకపోతున్న నిరుపేద గంగపుత్ర విద్యార్థులకు విద్యా వికాసం ఉన్నత విద్య వైద్య విద్యాభ్యున్నతికి తన వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు.సామాజిక సేవా దృక్పథంతో వైద్య రంగంలో సేవలందిస్తూ గంగపుత్ర సమాజ అభ్యున్నతికి కూడా డాక్టర్ సనత్ కుమార్ తన వంతు సహకారం అందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ తుంగతుర్తి సనత్ కుమార్ గంగపుత్రను మరోసారి అభినందిస్తూ ఆయన భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి ప్రజలకు వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు.

రాజకీయ లబ్ధి కోసం పొంగులేటిపై బురదజల్లే ప్రయత్నం

తప్పు చేస్తే సొంతవారినీ ఉపేక్షించరని వ్యక్తితం మంత్రి పొంగులేటి ది

రైస్ మిల్లుపై టాస్క్‌ఫోర్స్ దాడులు నిష్పక్షపాతం: డీసీసీ తోట దేవి ప్రసన్న



భద్రాద్రి కొత్తగూడెం (ప్రశ్న న్యూస్) రాజకీయంగా ఎదుర్కోలేకే ప్రతిపక్షాలు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శక పాలన అందిస్తోందని, తప్పు చేసిన వారు ఎంతటి వారైనా చట్టప్రకారం చర్యలు తప్పవని ఆమె ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆళ్ల మురళికి సంబంధించిన వ్యవహారం ఆయన వ్యక్తిగత వ్యాపార అంశమని, దీనితో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అక్రమాలకు పాల్పడుతున్న రైస్ మిల్లులపై టాస్క్‌ఫోర్స్ అధికారులు నిష్పక్షపాతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారని, అందులో భాగంగానే సంబంధిత మిల్లుపై దాడులు జరిగాయని తెలిపారు. తప్పు చేసిన వారు తనకు ఎంతటి ఆప్తులైనా మంత్రి పొంగులేటి ఉపేక్షించరని, చట్టం తన పని తాను చేసుకుపోతుందని అన్నారు. అధికారులపై మంత్రి రాజకీయ ఒత్తిళ్లు తెస్తున్నారనే ప్రచారంలో వాస్తవం లేదని ఖండించారు. మంత్రి పుట్టినరోజు నాడే సంబంధిత మిల్లులపై టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించి కేసు నమోదు చేయడం ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ వ్యవహారం న్యాయస్థానం పరిధిలో ఉందని, కోర్టు ఆదేశాలు, నిర్ణయాలకు అనుగుణంగానే ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రభుత్వానికి ఎవరిపైనా కక్షసాధింపు చర్యలు చేపట్టాల్సిన అవసరం లేదని, ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రాజకీయంగా విమర్శలు చేయడం పేరుతో అసత్య ప్రచారాలు చేయడం మానుకోవాలని తోట దేవి ప్రసన్న ప్రతిపక్షాలకు హితవు పలికారు.

ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లపై పోలీస్ కమిషనర్ సమీక్ష



శేర్లింగంపల్లి (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతిపాదిత పర్యటన నేపథ్యంలో సున్నం చెరువు, తమ్మిడికుంట చెరువుల వద్ద చేపడుతున్న ఏర్పాట్లను సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి, పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సున్నం చెరువు, తమ్మిడికుంట చెరువులను సందర్శించిన కమిషనర్ ఆయా ప్రాంతాల్లో పర్యటనకు సంబంధించి చేపట్టాల్సిన భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల రాకపోకలు, ఇతర మౌలిక ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో విధులు నిర్వహించాలని సూచించారు.ఈ సందర్భంగా సంబంధిత ప్రాంతాల్లో భద్రతా పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ట్రాఫిక్ మళ్లింపులు, పోలీస్ సిబ్బంది విధుల కేటాయింపు తదితర అంశాలను సమీక్షించారు. వివిధ శాఖల అధికారుల మధ్య సమన్వయం ఉండేలా చర్యలు తీసుకోవాలని, పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన ప్రశాంతంగా, సజావుగా సాగేందుకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. ఈ పర్యటనలో కూకట్‌పల్లి జోన్ డీసీపీ రితిరాజ్ ఐపీఎస్, మాదాపూర్ డివిజన్ ఏసీపీ సీహెచ్. శ్రీధర్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ పి. రమేష్‌తో పాటు ట్రాఫిక్ పోలీస్ అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్జేడీ పార్టీ అధ్యక్షులు తేజస్వి యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఐఐపీ తెలంగాణ నాయకులు

తాజ్ కృష్ణ హోటల్‌లో మర్రి ప్రభాకర్ ముదిరాజ్, చింతల నీలకంఠం ముదిరాజ్ భేటీ



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)ఆర్జేడీ పార్టీ జాతీయ అధ్యక్షులు తేజస్వి యాదవ్‌ను హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణ హోటల్‌లో ఐఐపీ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మర్రి ప్రభాకర్ ముదిరాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్ చింతల నీలకంఠం ముదిరాజ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ తరఫున శాలువాతో తేజస్వి యాదవ్‌ను ఘనంగా సత్కరించారు.అనంతరం ఇండియా కూటమిలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో ఐఐపీ పార్టీ చేపడుతున్న కార్యక్రమాలు, రాష్ట్రంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై తేజస్వి యాదవ్ ఆరా తీశారు.ఈ సందర్భంగా ఐఐపీ పార్టీ నాయకులు మాట్లాడుతూ, ఇండియా కూటమి బలోపేతం కోసం ఐఐపీ గుప్తా ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో పార్టీని విస్తరించే దిశగా తమ వంతు కృషి చేస్తున్నామని వివరించారు.దీనిపై తేజస్వి యాదవ్ సానుకూలంగా స్పందిస్తూ, నాయకుల కృషిని అభినందించారు. రాబోయే రోజుల్లో ఇండియా కూటమి విజయం సాధించి కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే దిశగా ముందుకు సాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు మరింత ఉత్సాహంతో ప్రజల్లోకి వెళ్లి కూటమి బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.

ప్రశ్నించడమే కాదు... ప్రజా సమస్యల పరిష్కారంలో 'ప్రజావాణి' ముందు చూపు

అధికారుల దాకా ఎందుకు? 'ప్రజావాణి' సంస్థ శ్రమదానం... ప్రభుత్వ దవాఖానా పైకప్పు శుభ్రం

వెంకట్ రెడ్డి నగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో 'ప్రజావాణి' బృందం శ్రమదానం... సేవా నిరతికి ప్రశంసలు



ఉప్పల్ (ప్రశ్న న్యూస్)సమాజంలో సమస్యలను వేలెత్తి చూపడమే కాకుండా, తమ వంతు బాధ్యతగా వాటి పరిష్కారానికి కృషి చేయడమే నిజమైన సామాజిక బాధ్యత అని 'ప్రజావాణి' స్వచ్ఛంద సంస్థ నిరూపించింది. మంగళవారం వెంకట్ రెడ్డి నగర్‌లోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ బృందం సందర్శించింది. దవాఖానాలోని పరిస్థితులను పరిశీలించిన క్రమంలో అపరిశుభ్రంగా ఉన్న పైకప్పును గుర్తించారు. కేవలం అధికారులకు విన్నపాలు చేసి వదిలేయకుండా, డాక్టర్ సురేష్ రెడ్డితో కలిసి ప్రజావాణి సంస్థ బృందం వెంటనే రంగంలోకి దిగి శ్రమదానం ద్వారా ఆ పైకప్పును శుభ్రం చేశారు.ఈ సందర్భంగా ప్రజావాణి సంస్థ నాయకులు ఎర్రం శ్రీనివాస్ మాట్లాడుతూ ఆసుపత్రిలో ఉన్న ఇతర సమస్యలను కూడా తమ సంస్థ తరఫున ఒక్కొక్కటిగా పరిష్కరించేందుకు శాయశక్తులా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ శ్రమదాన కార్యక్రమంలో ఆర్థో డాక్టర్ సురేష్ రెడ్డి, ప్రజావాణి సంస్థ ప్రతినిధులు వంపు లక్ష్మయ్య, విజయ్ కుమార్, తెడ్డు రవీందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్ ఎన్ఎఫ్‌సీ బ్రిడ్జిపై ట్రాఫిక్ నరకం

- ఏళ్ల తరబడి సమస్య, పట్టించుకునే నాథుడే కరువు
- ఇరుకైన వంతెనతో వాహనదారులకు నిత్యం అవస్థలు
- నాచారం నుంచి ఈసీఐఎల్, చర్లపల్లి వెళ్లాలంటే చుక్కలే
- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యం
- నాయకులకు ఫ్లెక్సీల హడావుడి తప్ప అభివృద్ధిపై చిత్తశుద్ధి ఏదీ.?



నాచారం (ప్రశ్న న్యూస్) ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసి మూడు సంవత్సరంలో ఉన్న ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధి సున్న అంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు సేవే లక్ష్యం అంటూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఎటుపోయాయో అని ప్రజలు అయోమయానికి గురవుతున్నారు.మల్లాపూర్ ఎన్ఎఫ్‌సీ బ్రిడ్జి వాహనదారులకు నిత్యం నరకం చూపిస్తోంది. నగర శివారు ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందుతుండగా, అందుకు అనుగుణంగా నగరం లోపల రహదారులు, వంతెనల విస్తరణ జరగకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఇరుకైన ఎన్ఎఫ్‌సీ బ్రిడ్జి వద్ద ఏళ్ల తరబడి ట్రాఫిక్ సమస్య కొనసాగుతున్నా పరిష్కారానికి మాత్రం ఏమాత్రం మోక్షం కలగడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఈ సమస్య కనిపించడం లేదా.? అన్న ప్రశ్నలు స్థానికుల నుంచి వెల్లువెత్తుతున్నాయి. మల్లాపూర్ పరిసర ప్రాంతాలు, ఎస్‌బీ కాలనీ, అశోక్‌నగర్ నుంచి వచ్చే వాహనదారులకు ఈ బ్రిడ్జి దాటడం ఒక పెద్ద పరీక్షగా మారింది. నాచారం నుంచి ఈసీఐఎల్, చర్లపల్లి వైపు వెళ్లే వాహనాలు బ్రిడ్జి వద్దకు చేరుకోగానే ట్రాఫిక్‌లో చిక్కుకుపోతున్నాయి. ఉదయం, సాయంత్రం రద్దీ వేళల్లో వాహనాలు బారులు తీరడంతో ప్రయాణికులు తీవ్ర అసహనానికి గురవుతున్నారు. కొద్ది దూరం ప్రయాణించడానికి కూడా విలువైన సమయం వృథా అవుతోంది. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు వెళ్లాల్సి వచ్చినా ఇబ్బందులు తప్పడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మూడేళ్లుగా ఏం సాధించారు.?

ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి దృష్టికి ఈ సమస్యను పలుమార్లు తీసుకెళ్లినా ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు కనిపించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. బ్రిడ్జి విస్తరణ చేపట్టాలా.? ప్రత్యామ్నాయ రహదారి నిర్మించాలా.? ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలా.? అనే అంశాలపై స్పష్టమైన కార్యాచరణ లేకపోవడం ప్రజాప్రతినిధుల పనితీరుపై అనుమానాలు కలిగిస్తోంది. మూడు సంవత్సరాలు గడుస్తున్నా నియోజకవర్గంలోని కీలక అభివృద్ధి పనులకు అసలు ప్రాధాన్యత ఇవ్వడం లేదంటూ ప్రతిపక్ష నాయకులు మండిపడుతున్నారు.



సమస్యలు లేని నియోజకవర్గమా.?

నియోజకవర్గంలో సమస్యలే లేవన్నట్లుగా ఎమ్మెల్యే చేసే ప్రకటనలు క్షేత్రస్థాయిలో కనిపిస్తున్న పరిస్థితులకు పొంతన లేకుండా ఉన్నాయని ప్రజలు విమర్శిస్తున్నారు. మరోవైపు ప్రజా సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం పోరాడాల్సిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు సైతం ఈ విషయంలో పూర్తిగా విఫలం చెందారని ఆశించిన స్థాయిలో స్పందించడం లేదన్న విమర్శలు స్థానికుల నుండి వినిపిస్తున్నాయి.ప్రజా సమస్యలపై గళమెత్తాల్సిన నాయకులు ఫ్లెక్సీలు, ప్రచార ఆర్భాటాలు, రాజకీయ కార్యక్రమాలకే పరిమితమవుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో అభివృద్ధి హామీలు గుప్పించే నాయకులకు ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న ట్రాఫిక్ కష్టాలు మాత్రం కనిపించడం లేదా అని నిలదీస్తున్నారు.

ఇప్పటికైనా స్పందించేనా.?

మల్లాపూర్ ఎన్ఎఫ్‌సీ బ్రిడ్జి విస్తరణకు సంబంధించి తక్షణమే సమగ్ర ప్రణాళిక రూపొందించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్య తీవ్రతను గుర్తించాలని కోరుతున్నారు. ట్రాఫిక్ సమస్యతో ప్రజల సహనాన్ని పరీక్షించకుండా శాశ్వత పరిష్కారం చూపాలని, లేకపోతే ఈ నిర్లక్ష్యానికి ప్రజలే తగిన సమాధానం చెబుతారని హెచ్చరిస్తున్నారు.

శ్రీలంకలో నిలిచిపోయిన మిర్చి కంటైనర్లు

- పీయూష్ గోయల్‌కు చంద్రబాబు లేఖ



అమరావతి (ప్రశ్న న్యూస్) మిర్చి రైతులు, ఎగుమతిదారులు ఎదుర్కొంటున్న తీవ్ర సమస్యను పరిష్కరించేందుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు రంగంలోకి దిగారు. శ్రీలంకలోని కొలంబో పోర్టులో నిలిచిపోయిన మిర్చి కంటైనర్ల సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు బుధవారం ఆయన లేఖ రాశారు. తక్షణమే జోక్యం చేసుకుని ఈ సంక్షోభానికి ముగింపు పలకాలని విజ్ఞప్తి చేశారు. చైనా, బంగ్లాదేశ్, ఇండోనేసియా, థాయ్‌లాండ్, సింగపూర్ వంటి దేశాలకు ఎగుమతి కావాల్సిన 150కి పైగా మిర్చి కంటైనర్లు కొలంబో పోర్టులో చిక్కుకుపోయాయని ముఖ్యమంత్రి తన లేఖలో వివరించారు. ఈ కంటైనర్లలోని మిర్చిలో తేమ శాతం నిర్దేశిత పరిమితి కంటే ఎక్కువగా ఉందని చెబుతూ, ఆయా దేశాలు వాటిని స్వీకరించేందుకు నిరాకరిస్తున్నాయని తెలిపారు. దీనివల్ల సుమారు రూ.60 కోట్ల విలువైన సరుకు ఎక్కడికీ కదలకుండా పోర్టులోనే నిలిచిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కంటైనర్ల నిలిపివేత కారణంగా మిర్చి పండించిన రైతులు, ఎగుమతిదారులు తీవ్ర ఆర్థిక నష్టాలను చవిచూస్తున్నారని చంద్రబాబు పేర్కొన్నారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో వారిని గట్టెక్కించేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు. సంబంధిత దేశాల ప్రభుత్వాలతో సంప్రదింపులు జరిపి, ఈ కన్సైన్‌మెంట్లను స్వీకరించేలా ఒప్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యను త్వరగా పరిష్కరించి, రైతులకు, ఎగుమతిదారులకు ఊరట కల్పించాలని లేఖలో కోరారు. ఈ వ్యవహారంపై కేంద్రం నుంచి సానుకూల స్పందన వస్తుందని రాష్ట్ర ప్రభుత్వం ఆశిస్తోంది.

మియాపూర్ భూములు పేదలకు పంచివ్వండి

- ఏడాదిలో కేసీఆర్ తిరిగి అధికారంలోకి వస్తారని ధీమా



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) మియాపూర్‌లోని 550 ఎకరాల ప్రభుత్వ భూమి వస్తే అమ్మేస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంటున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఆ భూములను అమ్మి సొమ్ము చేసుకోవాలని చూడకుండా, పేదలు, అమరవీరులు, ఉద్యమకారులకు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని హైదర్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్ రెడ్డి తన అనుచరులతో కలిసి ఈరోజు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడుతూ... "మియాపూర్‌లోని 550 ఎకరాల్లో 200 ఎకరాలు పేదల ఇళ్లకు, 100 ఎకరాలు అమరవీరులకు, మరో 100 ఎకరాలు ఉద్యమకారులకు కేటాయించండి. మిగిలిన భూమిలో పాఠశాలలు, కాలేజీలు కడితే మనస్ఫూర్తిగా స్వాగతిస్తాం" అని అన్నారు. ప్రజల ఆశీర్వాదంతో ఏడాదిలోపే కేసీఆర్ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం వచ్చాక ఈ భూముల వ్యవహారాలపై దృష్టి సారిస్తామని స్పష్టం చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినట్లు ఉద్యమకారులకు 250 గజాల స్థలం ఇచ్చే చిత్తశుద్ధి ఉందా అని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. ఎక్కడో 80 కిలోమీటర్ల దూరంలోని ఎర్రవెల్లిలో కాకుండా, హైదరాబాద్ నగర నడిబొడ్డున ఉన్న మియాపూర్‌లోనే అమరవీరులకు ఇళ్లు కట్టివ్వాలని సవాల్ విసిరారు. 'హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ' పేరుతో జరుగుతున్న స్కాంలో భాగస్వాములైతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని పారిశ్రామికవేత్తలను ఆయన హెచ్చరించారు.

ప్రమాదాలకు నిలయంగా నల్లగండ్ల హుడా లేఔట్

- 100 అడుగుల రహదారిపై మృత్యుఘంటికలు
- నిత్యం ప్రమాదాలు, క్షతగాత్రులుగా మారుతున్న వాహనదారులు
- స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలంటూ స్థానికుల డిమాండ్
- ప్రమాదాలపై విశ్లేషణ చేయని హెచ్ఎండీఏ, మున్సిపల్ అధికారులు
- ప్రాణాలు పోతున్నా స్పందించని యంత్రాంగం, ఇంకెంతమంది బలికావాలి.?



శేర్లింగంపల్లి (ప్రశ్న న్యూస్) నల్లగండ్ల హుడా లేఔట్‌లోని 100 అడుగుల ప్రధాన రహదారి వాహనదారులకు మృత్యుమార్గంగా మారుతోంది. విశాలమైన రహదారి, వేగంగా దూసుకెళ్లే వాహనాలు, నియంత్రణ లేని ప్రయాణం, వెరసి నిత్యం ఏదో ఒకచోట రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ రహదారిపై ప్రయాణించాలంటేనే వాహనదారులు, పాదచారులు భయాందోళనకు గురవుతున్న పరిస్థితి నెలకొంది. ప్రమాదాల నివారణకు కనీస చర్యలు చేపట్టాల్సిన మున్సిపల్, హెచ్ఎండీఏ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

విశాలమైన రోడ్డే ప్రమాదాలకు కారణమా.?

100 అడుగుల రహదారి కావడంతో వాహనదారులు అత్యంత వేగానికి హద్దులు లేకుండా ప్రయాణిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. రహదారిపై వాహనాల వేగాన్ని నియంత్రించే చర్యలు అసలు లేకపోవడం, అవసరమైన ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు, వేగ నియంత్రణ ఏర్పాట్లు లేకపోవడం ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం జరుగుతున్న ప్రమాదాల్లో పలువురు తీవ్రంగా గాయపడటమే కాకుండా, కొంతమంది శాశ్వత వైకల్యానికి గురవుతున్నారని, మరికొందరు ప్రాణాలు కోల్పోతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఒకే రోజు రెండు ప్రమాదాలు, కలవరపెడుతున్న పరిస్థితి

బుధవారం ఉదయం ఒకే రోజు రెండు రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. వరుస ప్రమాదాలతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఇన్ని ప్రమాదాలు జరుగుతున్నా మున్సిపల్, హెచ్ఎండీఏ అధికారులు కనీసం క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టకపోవడం, ప్రమాదాలకు గల కారణాలను విశ్లేషించకపోవడం, స్పీడ్ బ్రేకర్లు వేయాలని కోరిన వేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ప్రమాదాలు జరిగినప్పుడు హడావుడి చేయడం కాకుండా, ముందస్తు నివారణ చర్యలు చేపట్టాల్సిన బాధ్యత అధికారులపై లేదా.? అని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయరా.?

ఈ రహదారిపై వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు అవసరమైన ప్రాంతాల్లో నిబంధనలకు అనుగుణంగా వేగ నిరోధకాలు(స్పీడ్ బ్రేకర్లు) ఏర్పాటు చేయాలని కాలనీవాసులు పలుమార్లు విజ్ఞప్తి చేసామని పేర్కొన్నారు. అయినప్పటికీ అధికారుల నుంచి కనీస స్పందన లేకపోవడం వాళ్ల బాధ్యత రాహిత్యానికి నిదర్శనమని, కేవలం రహదారులు నిర్మించి చేతులు దులుపుకోవడమేనా.? ప్రజల ప్రాణాలకు భద్రత కల్పించాల్సిన బాధ్యత ఎవరిది.? అన్న ప్రశ్నలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి.



ఇంకెంతమంది ప్రాణాలు కోల్పోతే స్పందిస్తారు.?

హెచ్ఎండీఏ, మున్సిపల్ అధికారులు ఇప్పటికైనా మేల్కొని నల్లగండ్ల హుడా లేఔట్ 100 అడుగుల రహదారిపై ప్రమాదాల ప్రాంతాలను గుర్తించి సమగ్ర పరిశీలన చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. అవసరమైన చోట వేగ నియంత్రణ(స్పీడ్ బ్రేకర్లు) చర్యలు, హెచ్చరిక బోర్డులు, రోడ్డుపై స్పష్టమైన మార్కింగ్స్, రాత్రివేళ తగిన వెలుతురు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కొల్లూరు ట్రాఫిక్ పోలీసులు, కాలనీ సంఘం ప్రతినిధులు కూడా సమన్వయంతో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజల ప్రాణాలు గాల్లో దీపాలుగా మారుతున్నా అధికారులు ఇంకా ఎంతకాలం నిర్లక్ష్యం వహిస్తారు.? మరో ప్రమాదం జరిగి ఇంకొక కుటుంబం రోడ్డున పడకముందే స్పందిస్తారా.? లేక మరో ప్రాణం పోయిన తర్వాతే కదులుతారా.? అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

డెమొక్రాట్లతో కలిసి పనిచేస్తా

- ఎన్నికల ఫలితాలతో స్వరం మార్చిన ట్రంప్



న్యూయార్క్ (ప్రశ్న న్యూస్)అమెరికా మధ్యంతర ఎన్నికల్లో ఓటర్లు రిపబ్లికన్ పార్టీకి గట్టి గుణపాఠం చెప్పారు. ఎన్నికల ఫలితాలకు ముందు వరకు డెమోక్రాట్లు ప్రవేశపెట్టే ప్రతీ బిల్లును వీటో చేస్తానని గర్జించిన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఘోర పరాజయం తర్వాత అనూహ్యంగా స్వరం మార్చారు. దేశ శ్రేయస్సు కోసం డెమోక్రాట్లతో కలిసి పనిచేయడానికి సిద్ధమని ప్రకటించారు. "ఈ ఎన్నికల్లో నేను బ్యాలెట్‌పై లేను, ఒకవేళ ఉండుంటే మేము భారీ మెజారిటీతో గెలిచేవాళ్లం" అని వ్యాఖ్యానించారు ఈ ఎన్నికల్లో డెమోక్రాట్లు అంచనాలకు మించి ప్రతినిధుల సభ (హౌస్), సెనెట్ రెండింటినీ కైవసం చేసుకోవడంతో ట్రంప్ ఈ మేరకు దిగిరాక తప్పలేదు. ఎన్బీసీ న్యూస్ అంచనాల ప్రకారం, 435 స్థానాలున్న ప్రతినిధుల సభలో డెమోక్రాట్లు 256 సీట్లు గెలుచుకునే అవకాశం ఉంది. అదేవిధంగా, 100 మంది సభ్యులున్న సెనెట్‌లో కనీసం 54 స్థానాలు దక్కించుకుని స్పష్టమైన ఆధిక్యం ప్రదర్శించారు. ధరలు తగ్గిస్తానని, ప్రజల జీవితాలను సులభతరం చేస్తానని 2024 ఎన్నికల్లో ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిన ట్రంప్, ఆ తర్వాత ఆ హామీలను పక్కనపెట్టారు. అమెరికాను గొప్పగా మార్చేందుకు టారిఫ్‌లు విధించడం, ఇరాన్‌లో ప్రభుత్వ మార్పు కోసం యుద్ధానికి దిగడం, వైట్‌హౌస్ సుందరీకరణ వంటి భారీ ప్రాజెక్టులపై దృష్టి సారించారు. ఇవే ఆయన పట్ల ప్రజాగ్రహానికి కారణమయ్యాయి.రిపబ్లికన్లకు కంచుకోటలైన టెక్సాస్, కాన్సాస్, దక్షిణ కరోలినా వంటి రాష్ట్రాల్లో పార్టీ ఓటమి పాలుకావడం ఆయన అంచనాలను తీవ్రంగా దెబ్బతీసింది. కాన్సాస్‌లో 95 ఏళ్ల రిపబ్లికన్ల గుత్తాధిపత్యానికి తెరదించుతూ డెమోక్రాట్ అభ్యర్థి ఆడమ్ హామిల్టన్ సెనెటర్‌గా గెలిచారు. టెక్సాస్ గవర్నర్‌గా హినా హినోజోసా ఎన్నికవడంతో 36 ఏళ్ల రిపబ్లికన్ పాలనకు ముగింపు పడింది. ట్రంప్ స్వయంగా ఎంపిక చేసిన అభ్యర్థులు సైతం ఓడిపోవడం ఆయనకు వ్యక్తిగతంగా పెద్ద ఎదురుదెబ్బ. ఈ ఓటమితో పార్టీపై ట్రంప్ పట్టు సడలుతుందని, ఆయనను వ్యతిరేకించే వారి సంఖ్య పెరుగుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అధ్యక్షుడిగా మిగిలిన రెండేళ్లలో ఆయన దూకుడుకు కళ్లెం పడుతుందని అంచనా వేస్తున్నారు. ఫలితాల తర్వాత 'పొలిటికో'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ, "రెండేళ్ల పాటు ప్రతీదాన్నీ వీటో చేస్తూ కూర్చోవాలని నేను అనుకోవడం లేదు. దేశానికి మంచి జరిగేలా చూసేందుకు డెమోక్రాట్లతో కలిసి పనిచేస్తాం" అని తెలిపారు.అయితే, డెమోక్రాట్లు మాత్రం ఏమాత్రం తగ్గడం లేదు. ప్రతినిధుల సభ స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టనున్న హకీమ్ జెఫ్రీస్ మాట్లాడుతూ, "మేము కీలకమైన మార్పులు తీసుకురావాల్సి ఉంది. ఇప్పుడున్న వ్యవస్థలు సరిగా లేవు. అమెరికా ప్రజలకే ప్రాధాన్యత ఇచ్చే కాంగ్రెస్ కావాలి" అని స్పష్టం చేశారు. దీంతో రాబోయే రెండేళ్లలో ట్రంప్ పాలన ఎలా సాగుతుందనేది ఆసక్తికరంగా మారింది.

ప్రసాద్ హాస్పిటల్ పక్కన పొంగుతున్న డ్రైనేజీ

- మురుగులోనే నడుస్తున్న జనం
- ప్రతి గల్లీలో నేతలు ఉన్నారు. కానీ
- సమస్య తీర్చేవాడే లేడు, పట్టించుకోని అధికారులు



నాచారం (ప్రశ్న న్యూస్)నాచారం ప్రసాద్ హాస్పిటల్ పక్కన డ్రైనేజీ పొంగి పొర్లుతూ రోడ్డంతా మురుగునీరు పారుతోంది. ఆస్పత్రికి వచ్చే రోగులు, పక్కనే ఉన్న ఢిల్లీ పబ్లిక్ స్కూల్ కు వెళ్లే చిన్నారులు రోజూ ఈ మురుగులోనే నడవాల్సిన దుస్థితి నెలకొంది. అయినా అధికారులు మాత్రం కళ్లు మూసుకుని కూర్చున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గల్లీకో నాయకుడు, వీధికో జెండా ఉన్న ఈ నాచారం, మల్లాపూర్ లలో ప్రజా సమస్యలు తీర్చే నాథుడే కరువయ్యాడు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం ఇంటింటికీ తిరిగే నేతలు, ఇప్పుడు డ్రైనేజీ దుర్గంధం గురించి అడిగితే మొహం చాటేస్తున్నారు. రెండుసార్లు గెలిచామని గొప్పలు చెప్పుకోవడం తప్ప ప్రజల సమస్యలు తీర్చాలన్న చిత్తశుద్ధి ఒక్కరికి లేదని ఇదేనా మీరు చేసే అభివృద్ధి అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అసలే నాచారం ప్రాంతం దోమలకు కేంద్ర బిందువు దానికి తోడు డ్రైనేజీ నీరు రోడ్డుపై నిలిచిపోవడంతో దోమలు విపరీతంగా పెరిగిపోయాయి. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అయిన జలమండలి అధికారులు, జీహెచ్ఎంసీ సిబ్బంది ఇటువైపు తొంగి చూడటం లేదు. ఫిర్యాదులు చేసి చేసి ప్రజలు అలసిపోతున్నామని అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు.ఆస్పత్రికి వచ్చే గర్భిణీలు, వృద్ధులు మురుగు దాటలేక పడిపోతున్న ఘటనలు జరుగుతున్నాయి. స్కూల్ పిల్లలు బూట్లు, బ్యాగులతో మురుగులో దిగి వెళ్తుంటే తల్లిదండ్రుల గుండె తరుక్కుపోతోంది. ఘాటైన వాసనతో అక్కడనుండి నడవలేని పరిస్థితి ఏర్పడ్డది. పక్కనే ఢిల్లీ పబ్లిక్ స్కూల్ లాంటి పెద్ద విద్యా సంస్థ ఉన్నా అధికారులు ఎందుకు స్పందించడం లేదో అర్థం కావడం లేదు. ఇది నిర్లక్ష్యమా.? లేక కమీషన్ల కోసం ఎదురుచూపా.? అని ప్రజలు నిలదీస్తున్నారు.ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి యుద్ధ ప్రాతిపదికన డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని, లేకపోతే ప్రజలు ఆందోళనకు దిగుతామని హెచ్చరిస్తున్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588